# బాల



పిల్లల మాసపత్రిక

## పెట్రోలు అక్కఱలేదు !



—ఫోటో : జగన్మోహన్.

చి॥ కె. యస్. ఇందిర (మదరాసు)

# చందు యొక్క సాహసకృత్యములు



# అమృతాంజనము

అమృతాంజనము పోటుబంటు
అది సకల-ఆధివ్యాధులను మెడకొంటు ॥అమృ॥

1. తలనొప్పి తలను తొలు-తొలుత అదివృచ్చినది
పడిశమ్ము మెడలోన-శులిశమ్ము గ్రుచ్చినది ॥అమృ॥

2. పుండు గజ్జిబాధ-చెందునది నిముసమున
గాయములమాన్పు-నిరపాయ సదుపాయమున ॥అమృ॥

3. దగ్గువల్లను కలుగు-విగ్గులను నగ్గడచు
తగ్గించు జ్వరముపో-తరము కనుమంటలను ॥అమృ॥

4. అతిపరిశ్రమను దేహం బలసిపోయినను
నరములు బిగువుతప్పి-నవయంగ జేసినను
అమృతాంజనంబు సుం-తగ మర్దనముచేయి
తేపగాని పొందు నీ-దేహమెల్లను హాయి ॥అమృ॥

5. ఏవిధంబుగనీకు-ఏ బాధకలిగినను
వేవిధంబులుగ అమృ-తాంజనము సాయపడు
అమృతంబనగ నింత-కంటె వేరెయ్యదియొ ?
ఈజ్ఞానమును నిడున-దే యంజనముకాదె ! ॥అమృ॥

6. అమృతాంజనంబు సా-ర్థకనామధేయమిటు
కమనీయములు దాని-క్రమమైన మహిమలటు
రమణీయముగ దిగం-తముల కడప్రాకినది
శమియించు నెల్లభూ-జనుల బాధలనునది ॥అమృ॥

గరిమెళ్ల సత్యనారాయణ, బి. ఏ.



బడిలోనూ బయటా
చక్కగా అందంగా
చల్లగా హాయిగా
కోఆప్టెక్స్ వస్త్రాలు
గట్టిచేనేత మంచిమన్నిక
చదువుకునే పిల్లలకు పాఠశాల
లోనూ ఆటపాటలలోనూ
అనుకూలమైనవి

కోఆప్టెక్స్ వస్త్రాలు

పిల్లలకు ఉత్సాహమిచ్చును

మగ్గములనుండి మీవద్దకు

| |
|---|
| చెక్స్, డ్రిల్స్ |
| లాంగ్ క్లాత్ |
| అద్దకములు |
| చింట్స్ |
| నాయిల్స్ |

బాలబాలికలకు ఉత్తమ
అలంకారము

కో-ఆప్టెక్స్

మద్రాస్ హాండ్‌లూమ్ వీవర్స్ ప్రొవిన్షియల్
కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
వేస్ గార్డెన్స్, 34, పాంథియన్ రోడ్, ఎగ్మూర్, మద్రాస్

# పెప్పర్ మింట్ లేదా ...



మీకు కావలసిన రుచి ఏమిటో సరిగ్గా తెలుసుకోవటంలో ఎంత ఆనందం ఉంది! ఈవేళ పెప్పర్ మింట్ ఇష్టం. రేపు కేరామెల్ ఇష్టం కావచ్చు. మేము అన్ని రకాలూ తయారు చేస్తారు. వాటి అన్నిటిలోనూ తప్పకుండా ఉన్న ముఖ్యలక్షణం లోపంలేని పరిశుభ్రత.

దేశమంతటా ఆదరించబడినది.

# సావరిన్ స్వీట్స్

ది కె. సి. పి. కన్ఫెక్షనరీ (మదరాసు) లిమిటెడ్, మదరాసు 24.



ఆ ఇద్దరు పాపల ఆటలూ, పాటలూ చూచి ఆ తల్లి మురిసిపోతోంది.

ఆ తల్లి ఆరోగ్యంగా వుండటంవల్లే అంత చక్కని పిల్లలు పుట్టేరు.

ఆమె ఆరోగ్యానికి ప్రతిరోజూ ఏమిటి పుచ్చుకొంటుందో తెలుసా?

# లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్.

రాయపేట-మదరాసు-14

# నాగుపాము పగ!

కూర్పు: జి. హరినాథబాబు (పెంటపాడు)

బాలా!

నాగుపాము పగపట్టిదంటే ఊరుకోదు. కాసి కాసి ఎన్నాళ్లయినా సరే తనపగ తీర్చుకుంటుందట!



ఈ పైబొమ్మలో పాపం ఒక చిట్టెలుక ఒకనాడు నాగుపాము తోకను గమ్మత్తుగ్గా కరిచి పారిపోయిందట. నాగుపాముకి కోపంవచ్చింది. చిట్టెలుక ఒక చిక్కుదారుల సారంగంలోదూరి దాగుంది. కాని, పగపట్టిన నాగుపాము ఆదారి ఎలాగోకనుక్కొని వెళ్లింది. బాలా! అదారినీవు తెలుసుకోచూద్దాం.

# బొమ్మల పెండ్లి

రచన : సిద్ధాంతి మల్లికార్జునం, బి.ఏ., బియిడి.

వచ్చిందమ్మా వచ్చింది
దసరా పండుగ వచ్చింది
సరదానిచ్చే బొమ్మల పండుగ
వచ్చిందమ్మా వచ్చింది. ॥
బజారుకెళ్తా
బొమ్మలుకొంటా
బొమ్మలకెన్నో
సొమ్ములుపెడ్తా
బొమ్మల గదినీ
శృంగారిస్తా
బొమ్మల కొలువును
బాగాపెడ్తా ॥ వ ॥
పేరంటాళ్లను
పిలిచీవస్తా
మిఠాయి భక్ష్యాల్
తయారుచేస్తా
పేరంటాళ్లకు
పంచీపెడ్తా
బొమ్మల పెండ్లిని
బాగాచేస్తా ॥ వ ॥
ఇదిగోనమ్మా ఈనాడే
బొమ్మలు పెట్టేదీనాడే
తలంటి స్నానం ఈనాడే
బొమ్మలు కొనడం ఈనాడే
బట్టలు కొనడం ఈనాడే
పండుగచేసే దీనాడే. ॥ వ ॥
పూలపావడా పువ్వులగౌను
స్నానంచేసి వేసుకుంటా
కళ్లకు కాటుక పెట్టుకుంటా
కుంకుమబొట్టు పెట్టుకుంటా
జడలో పువ్వులు పెట్టుకుంటా
రంగుల రిబ్బను కట్టుకుంటా

మెడలో దండలు వేసుకుంటా
గాజులు చేతికి పెట్టుకుంటా
ఘుమఘుమలాడే అత్తరు సెంటూ
కొత్త బట్టలకు రాచుకుంటూ.
సంతోషంతో పాడుకుంటా
ఆనందంతో ఆడుకుంటా ॥ వ ॥
సావిత్రమ్మ చక్కనిబొమ్మ
పేరంటానికి రావమ్మా
రమణమ్మా ఓ రంగులబొమ్మా
బొమ్మల కొలువుకు రావమ్మా
కమలమ్మా ఓ కనకపు బొమ్మా
తాంబూలానికి రావమ్మా
మీనాక్షమ్మా ముద్దులగుమ్మా
పసూంకానికి రావమ్మా.
భ్రమరాంబా మాబంగరుబొమ్మా
బొమ్మలపెండ్లికి రావమ్మా. ॥వ॥
లేడికన్నుల లలితా రావే
చిలిపి కన్నుల సుందరి రావే
నెమలి నడకల నళినీ రావే
పమిడి బుగ్గల పద్మిని రావే
వెన్నెల నవ్వుల వసంతా రావే
చక్కన్ని బాలాచంద్రికరావే ॥వ॥
పేరంటానికి వేళైందమ్మా
పేరంటాళ్లిక వస్తారమ్మా
గదిలో చాపలు వేస్తానమ్మా
ఆకులు వక్కలు తెస్తానమ్మా

## ద స రా పి లు పు



శ్రీ రామగిరి వరలక్ష్మమ్మ, నేస్తం కమలమ్మ వాళ్ళ సికింద్రాబాదుకి రమ్మంటున్నారు.

గంధపు గిన్నెలు తెస్తానమ్మా
అగరువత్తులను తెస్తానమ్మా
మిఠాయి భక్ష్యాల్ తెస్తానమ్మా
పువ్వులు పండ్లూ తెస్తానమ్మా
జ్యోతులు వెలిగిస్తానమ్మా ॥వ॥
పేరంటాళ్లూ రారండి
బొమ్మల గదిలో కూర్చోండి
బొమ్మల పెండ్లిని చూడండి
పాటలు చాలా పాడండి.
చాలా సరసా లాడండి ॥ వ ॥
సీతారాముల పెండ్లిచేస్తా
పద్మిని నీవూ పాట పాడవే

ంత నీవూ, వేణు వూదవే
నీ నీవూ నాట్యమాడవే
ంలతి నీవూ మాలవెయ్యవే ।వ।
ారాముల పెండ్లినిచూచి
ారాముల దీవించండి.
ంగళహారతి పాటపాడి
ంబూలాలు తీసుకపొండి ॥వ॥
రంటాళ్లకు
ళ్లకు పసుపు
రంటాళ్లకు
ండలో గంధం

పేరంటాళ్లకు
కుంకుమబొట్టు
అందంగానే
పెడ్తాను.
తాంబూలాలు
వారికి ఇస్తా
నమస్కారములు
వారికి చేస్తా
దీవనలన్ని
సంపాదిస్తా ॥ వ ॥

## బొమ్మలో అంకెలు!




బాలా! ఈ పై పటములో ఒకటినుండి పదివరకు అంకె
ండివున్నాయి. అవేవో కనుక్కో చూద్దాం!

బొమ్మ: ఐ. వి. యల్. నరసింహారావు (నెల్లూరు)


# దాగుడు బంధువులు

కూర్పు: పి. యస్. అనంతాచారి, (విశాఖపట్నం)

బాలా! నీ బంధువులందరూ ఒక్కొక్కరొక్కొక్క వాక్యములో నక్కియున్నారు. వారెవరో పోల్చుకో చూద్దాం. నీకు తెలియక పోతే ఆఖరు పేజిలలో సమాధానముచూడు.

1. సీతా తలుపువేయుము.
2. నదికి అవ్వలిగట్టున పడవగలదు.
3. లక్ష్మీకాంతం డ్రిల్లు చేయగలదు.
4. నీవు సంతత మాతని యొద్దనే యుండకుము.
5. రామా మర్మమేల!
6. నేను బాలతో అన్నమాట మీకు తెలిసినదా?
7. కలువ దినకరుని చూచి వికసించును.
8. డాబా వలన చాలలాభములు కలవు
9. నీవు ఏల అక్కడికి ఆలస్యముగా వెళ్ళితివి.
10. పడమర దిక్కున సూర్యుడు అస్తమించును.

## ఇంగ్లీషు ఎలుక!



mouse

బాలా! ఇంగ్లీషు అక్షరాలతో తయారయిన ఈ ఎలుకని చూచావా? ఇంగ్లీషు ఎలుకలు మన దేశాన్ని వదిలి పారిపోయినా మన స్వదేశీ నల్లబజారు పందికొక్కులు ఇంకా మనల్ని వదలలేదు!

బొమ్మ: మదిగంటి బాలసుబ్రహ్మణ్యం (బందరు)

# వింత పెండ్లి

రచన: యల్. కృష్ణమూర్తి.

పిఠాపురంలో పినిసెట్టివారింటిలో పిల్ల ఉంది. ఆపిల్లకు యుక్తవయస్సొచ్చింది. తల్లిదండ్రులు తగినసరునిచూచి పెండ్లిచెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ సమయంలో

అక్కవలసవాళ్లు
అడగటానికెళ్లేరు,
ఇసుకలపేటవాళ్లు
యిల్లు చూపులకెళ్లేరు.
తిమ్మాపురంవాళ్లు
తిళ్లుకుడుపులకెళ్లేరు.
పట్టుపురంవాళ్లు
పసుపునూనెలుపోసేరు.
వివాహానికి సిద్ధపడ్డారు.
అక్కులపేటవాళ్లు
అరిసెలొండేరు.
వడ్డాదివాళ్లు
వబ్బట్లొండేరు.
గారవాళ్ళు గారెలొండేరు.
బూరాడపేటవాళ్ళు
బూరెలొండేరు.
ఆమదాలవలసవాళ్లు అట్లు
దూసివాళ్ళు దోసెలు
సౌడాంవాళ్ళుసుగాళ్ళు
ఈప్రకారం అంతా
వివాహానికి సిద్ధం.
పంగోలునుండి
వరుడొచ్చాడు.
వధూవరుల్ని పీటలపై
కూర్చోబెట్టేరు.
పురుషోత్తపురంవాళ్ళు
పుస్తెముడివేస్తే,
శిమడాంవాళ్ళు
తీసికెళిపోయారాపిల్లని.
వెంటనే
కొవ్వూరువాళ్ల
కోక్కపంవచ్చింది.
నగరికటకంవాళ్లంతానవ్వారు
దువ్వారపుపేటవాళ్ళు
దుడ్డులుతీస్తే
కొర్లకోటవాళ్ళు
కొట్టుకున్నారు.
తలగాంవాళ్ళు తన్నుకున్నారు
బొబ్బిలివాళ్ళు దెబ్బలాడేరు,
ఈ తగవు యీదలవల్ల
నాయుడిగారికెళ్లింది
నావల్లగాదన్నారు
నాయ్డుగారు,

బాలలూ యీ తగువు మీరెల్లాగో తీర్చి ఎవరిండ్లకు వాళ్లను పంపెయ్యండి, మీ దేపుణ్యం!!!



# బొమ్మల కథ

(సీరియల్)

మిఠాయి బాలలో గోము ఎలాగ గాలిపటం దారంతో గాలిలోనికి ఎగిరి పోయిందో చదివారు. అలాగ, గోము గాలిపటం తోబాటు గాలిలో కొట్టుకొని పోతూ వుండగా రివ్వుమని ఒక పెద్ద గరుడపక్షి ఎగురుతూ వస్తోంది.

ఆ పక్షి కాళ్లకి గోము గౌను, గాలిపటం దారం తగులుకొని చిక్కుపడి పోయాయి. దారం తెగి గాలిపటం ఎటో పోయింది. గోము పక్షి కాళ్లకు చిక్కుకొని పక్షితోపాటు ఎగురుతూ వుండగా, ఓ చెట్టుకొమ్మ దొరికింది. కొమ్మను గట్టిగా పట్టుకొని ఎలాగో పక్షినుండి తప్పించుకుంది.

చెట్టుకొమ్మమీద అలసట తీర్చుకుంటూ కూర్చొనగా అంతలోనే ఆ కొమ్మమీదవున్న "నేస్తం" గోము దగ్గర కొచ్చాడు.

"తింటావా?" అన్నట్టుగా ఆ కోతి నేస్తం చేత్తో ఒక పండు అందిచ్చాడు. తరువాత ఏమయిందో వచ్చేనెల 'బాల'లో చదవండి.

# ఎవరీ పిన్ని?

రచన : 'లలిత'

అనగా అనగా ఒక నాన్న ఒక అమ్మా వున్నారు. వాళ్ళకి ముగ్గురు పిల్లలు. జయ, వేణు, గోపు అని వాళ్ళ పేర్లు. వాళ్ళని చూస్తే వాళ్ళ అమ్మా, నాన్నకి ఎంతో ముద్దు. నాన్న అట్టే ముద్దుచేస్తే అమ్మ వద్దంటుంది. అమ్మ అట్టే ముద్దుచేస్తే నాన్నకి ఇష్టం వుండదు. ఎందుకంటే అట్టే ముద్దుచేస్తే పిల్లలు చెడిపోతారని. అయినా ఆ నాన్నా అమ్మా ఆపిల్లల్ని ఒక్కనాడేనా కోప్పడేవారు కాదు.

వేణూ, గోపూ కాస్త అల్లరి చేసేవారు. అయినా ఆ అల్లరి చూసీ చూడనట్టు అమ్మా నాన్నా ఊరుకొనేవారు.

ఒకనాటి రాత్రి గోపూ, వేణూ వేగిరం పడుకోకుండా రాత్రి పదిన్నర గంటల వరకూ బాతాకానీ వేశారు. జయ 9 గంటలకే నిద్రపోయింది. ఆ మర్నాడు పొద్దున్న వాళ్లు లేచి చూచేసరికి వాళ్ల పరుపుమీద ఒక చిన్న కాగితం మడత పడి వుంది. వేణు ఆ కాగితం తీసి చూచాడు. అది ఒక చిన్న ఉత్తరం.

"పిల్లలూ!

మీ ముగ్గురిలో జయ మంచి పిల్ల. బాతాకానీ చేయకుండా సరిగా టైముకి నిద్రపోయింది. 'జయ'కి నా ముద్దులు.

ఇట్లు, మీ
ప్రియమైన పిన్ని."

ఈ ఉత్తరం ముగ్గురు పిల్లలూ చదివారు. గబగబలేచి ఆ వుత్త

రాన్ని వాళ్ల అమ్మకి చూపించారు.

"అమ్మా! ఎవరే ఈ 'పిన్ని'?" — అని అడిగారు.

"అదేమో! నాకు తెలియదు. మీ నాన్నని అడగండి" అని అమ్మ చెప్పింది.

ముగ్గురూ నాన్న దగ్గరికి పరుగెత్తి వెళ్లారు.

"నాన్నా! నాన్నా! ఈ వుత్తరంచూడు. పిన్ని రాసింది. నాన్నా! ఎవరా పిన్ని నాన్నా?" అని అడిగారు.

"అదేమో నాకు తెలియదుగాని, ఈ పిన్ని ఎవరో మంచి పిన్ని అయివుంటుంది. మీరు మంచిపనులుచేస్తే ఇటువంటి వుత్తరాలు రాస్తుందేమో?" అని నాన్న అన్నాడు.

ఆ రాత్రి వేణూ గోపూ ఛాతాకానీ చేయకుండా వేళకే పడుకున్నారు. ఆ మర్నాడు పొద్దున్నలేచి పరుపుమీద చూచారు. చీటీలేదు! పళ్లు తోముకొని, ముఖం కడుక్కొని గదులో అలమార దగ్గరకువెళ్లి చూచేసరికి అక్కడ ఒక కొత్త బిస్కటు పెట్టెవుంది. ఆ పెట్టెకి ఒక చీటీ కట్టివుంది. దానిమీద "బహుమానము" అని రాసి వుంది.

వేణు, గోపూ గబగబ ఆ పెట్టెవిప్పి చూశారు. అందులో ఇలా రాసివుంది.

"పిల్లలూ!

మీరు వేళకు నిద్రపోతున్నందులకు మీకు ఈ బహుమానము.

ఇట్లు మీ

పిన్ని"

♦ ♦ ♦

ఇలాగే ఆ మర్నాడు పెరటి గుమ్మం దగ్గర ఒక చీటీ దొరికింది. అందులో ఇలా రాసి వుంది.

"గోపూ!

నీవు సరిగా పళ్లు తోముకోలేదు. నిన్ను చూస్తే నాకు అసహ్యం.

ఇట్లు నీ

పిన్ని"

♦ ♦ ♦


ఇలాగ ప్రతిరోజూ ఏదో ఒక బహుమానమో ఒక చీవాట్ల వుత్తరమో పిల్లలకు దొరుకుతుండేది. అయినా ఆ మంచి

పిన్ని ఎవరో ఎవరికీ తెలియలేదు.

ఒకనాడు వాళ్ల అమ్మ ఏదో తొందర పని మీద వూరికి వెళ్లింది. వారం రోజుల వరకూ రాదు. జయ, వేణు, గోపులకు ఏమీ తోచ లేదు. ఇంకో చిత్రం ఏమిటంటే "పిన్ని" కూడా చీటీలు, ఉత్తరాలు, బహుమానాలు పంపడం మానేసింది.

"నాన్నా! మేము రోజూ ఎన్ని మంచి పనులు చేసినా 'పిన్ని' బహుమానాలు పంప లేదు ఏమి?" అని వాళ్ల నాన్నని వాళ్లు అడిగారు.

"అదేమో నాకేం తెలుసు? ఆ 'పిన్ని' ఎవరో తెలుస్తే బాగుండును. మీ అమ్మ వూళ్లో లేకపోవడం, 'పిన్ని' బహుమానాలు ఆగిపోడంచూస్తే చిత్రం గానే వుందికదూ!" అని నవ్వుతూఅన్నాడు నాన్న.




ఆ నవ్వులో అర్థం వుంది. జయ, వేణూ, గోపూ అది కనిపెట్టేశారు. ముగ్గురూ కలిసి రహస్యంగా ఏదోఆలోచించారు.

ఆ మర్నాడు వాళ్ల అమ్మ ఊరునించి తిరిగి వచ్చింది. గదిలోకి వెళ్లింది. అక్కడ టేబిలు మీద, అద్దం దువ్వెనా వున్నచోట ఒక చీటీ వుంది. అమ్మ ఆ చీటీ విప్పి చదివింది.

"పిన్నీ! నీ వంటి మంచి అమ్మ ఈ ప్రపంచంలో లేదు సుమా!

ఇట్లు నీ


ప్రియమైన పిల్లలు"

అమ్మ అదిచూసి నవ్వుకుంది. నాన్నకూడా నవ్వేడు. "ఎవరీ పిన్ని?" అని నాన్న గమ్మత్తుగా అడిగాడు.

"ఇదుగో! ఈ అమ్మే పిన్ని" అని పిల్లలు గొల్లున నవ్వారు.

# కాఫీ కప్పు ఎగిరిపోతోంది! (ముగ్గులు)





బాలా!

**ఈకప్పు టేబిలుమీాంచి ఎగిరి పోతోంది! పట్టుకో పట్టుకో! తిరిగి టేబిలుమీాద పెట్టి, అందులో పాలు పోసి త్రాగు.**

కూర్పు: కుర్చీ-టేబిలు: బళ్ల శ్యామలాంబ (బందరు)
కాఫీకప్పు: వి. శ్యామలాంబ (మచిలీపట్టణం)

# నల్లమందు నష్టం

రచన : కందుకూరి శేషగిరిరావు (అమలాపురం)

బాలలూ! మీరు నల్లమందును చూచారా? నల్లమందు తింటే మత్తు కలిగిస్తుంది. అది తినడం ఒక దురలవాటు. ఒక సారి అలవాటయితే అది మానడం కష్టం. నల్లమందుమీద ఒక కథవుంది.

అనగా అనగా ఒక బ్రాహ్మడుండేవాడు. ఆ బ్రాహ్మడికి నల్లమందు అలవాటు. మూడు పూటలూ గచ్చకాయంతేసి నల్లమందు తినేవాడు. అంచేత ఆ బ్రాహ్మడు ఎప్పుడూ కునుకుతూ నిద్రపోయేవాడు.

సాయంత్రం, సంధ్యవార్చుకుందుకు చెరువుగట్టుకి వెళ్లి, తన జారీచెంబుతో నీళ్లు నిండా ముంచేవాడు. గట్టుమీద ఒక చెట్టుకి చేరబడి సంధ్యావందనం చేస్తూ చేస్తూ కునుకుతూ, మధ్య మధ్య జపం మరిచిపోతూ, ఒక ఝాము రాత్రికి ఇల్లు చేరుకొనేవాడు!

ఒకనాడు ఆ బ్రాహ్మడు చెట్టు దగ్గర కునుకుతూ కూర్చొని వుండగా ఒక దొంగ చూచాడు. ఆ బ్రాహ్మడు మేల్కొని వున్నాడో లేదో చూడడానికి రెండు బెడ్డలు జారీమీదకు విసిరాడు. టంగ్ టంగ్ మని శబ్దం అయినా బ్రాహ్మడు లేవలేదు. దొంగ మెల్లగావచ్చి ఆ జారీ ఎత్తుకొని పారిపోయాడు.


బ్రాహ్మడు కొంతరాత్రికి లేచి చూచుకొనే సరికి జారీలేదు! ఆ మర్నాడు ఇంకో కొత్తజారీ కొని, తీసుకెళ్లాడు. మళ్లీ అలాగే దొంగవచ్చి జారీ ఎత్తుకొని పోయాడు. ఇలాగ ప్రతీరోజూ జారీలుపోవడం బ్రాహ్మడికి కష్టం అనిపించింది. ఆ మర్నాడు దొంగని పట్టుకోడానికి ఒక ఉపాయం ఆలోచించాడు. చెట్టుదగ్గరికి వెళ్లి అక్కడ తానేఒక జారీఆకారంలో ముసుగు వేసుకొని కూర్చున్నాడు. దొంగవచ్చి అది ఒక పెద్దజారీ



అనుకొని తనదగ్గరకొచ్చి పట్టుకోగానే, తాను ఆ దొంగని పట్టుకుందామని ఆలోచన. తన కుడి చేతిని జారీకొమ్ములాగను, తాను జారీలాగను కూర్చున్నాడు.

చీకటిపడింది, దొంగ వచ్చాడు, మామూలుగా జారీ కనిపించలేదు. ఆ జారీ ఎక్కడుందో తెలుసుకోడానికి రాళ్లు విసిరాడు. బ్రాహ్మడికి రాయి తగలగానే, జారీ మ్రోగినట్లు తానే నోటితో "టంగ్" మని అన్నాడు. ఇంకోరాయి తగిలింది. ఇంకోసారి నోటితో "టంగ్."

ఈ వింత శబ్దం దొంగ విన్నాడు. అనుమానంతో కొంచెందగ్గరి కొచ్చాడు. బ్రాహ్మడి కుడిచేయి కదిలించాడు. ఆ బ్రాహ్మడు "బొళక్! బొళక్!" అని నీళ్లు చప్పుడు అయినట్టు అన్నాడు. దొంగ దగ్గరికి రాగానే పట్టుకుందామని ఆ బ్రాహ్మడు చూస్తున్నాడు కాని దొంగ దూరంగానే వున్నాడు. ఇంతలో మన బ్రాహ్మడుగారికి కాస్త కునుకు వచ్చింది. చిన్న గుఱ్ఱుతో నిద్రతీశాడు.



దొంగ ఇదే సమయమని ఆ బ్రాహ్మడు కప్పుకొన్న దుప్పటి ఎత్తుకొని పారిపోయాడు.

బ్రాహ్మడు లేచేసరికి అర్ధరాత్రి అయింది. చలితో ఒణుక్కుంటూ ఆ నల్లమందు బ్రాహ్మడు ఇల్లుచేరుకున్నాడు.

"ఛీ! ఇకముందు నల్లమందు తినను!" అని ఒట్టు వేసుకున్నాడు.

చూశారా బాలలూ! నల్లమందువలన ఎంత నష్టమో! అంచేతే మన మద్రాసు ప్రభుత్వంవారు "నల్లమందు తినకూడదు" అని రూలు పెట్టారు.

---

**తెలుసా**

"బాల" ఈ నెలనుంచీ తన సొంతప్రెస్సులోనే అచ్చు ప్రారంభించింది. ఒచ్చే నెలనుంచి ఇంకా వేగంగా వస్తుంది.

# మేదరినీతి

రచన :
పుల్లాభట్ల వెంకటసత్యనారాయణ
(ఖర్గపూర్)

అనగా అనగా ఒకరాజు ఉండే వాడు. అతడు ఒకరికి ఉప కారం చేయడం అంటే ఉరి పెట్టుకొనేవాడు. రాజుగారి కోట కావల ఒక చిన్న గుడిసె వుండేది. అందులో ఒక మేదరి నివశించేవాడు. రాజుగారి కుమా రుడు ఒక దీపావళి రోజున టపా కాయలు కాల్చుకుంటూ ఉంటే ఒక తారాజువ్వ వెళ్లి మేదరి గుడిసెని కాల్చివేసింది.

ఆ మరునాడు మేదరి భయం తో రాజుదగ్గరకు వెళ్లి జరిగిన సంగతి అంతయూ మనవిచేసు కున్నాడు. దానికి రాజు కోపించి నీవంటి నీచుడు నా కోటదగ్గర నుండకూడదు. కాబట్టి ఈ ఊరు విడిచి దూరముగా పో అని ఆజ్ఞా పించాడు.

మరికొంతకాలానికి రాజుగారి కుమారుడు మేడ మెట్లెక్కుచూ ప్రమాదమువల్ల కాలుజారి క్రింద పడిపోయేడు. క్రమముగా కాలు వాచి చాలా బాధపెట్టసాగింది. పాపం రాజకుమారుడు కుయ్యో మొర్రో అని యేడుస్తూ ఉంటే అందరికి జాలివేసింది. అనేకమంది వైద్యులు వచ్చి అనేక మందులు రాశేరు. కాని లాభంలేక పోయింది. రాజుగారి పెద్ద డాక్టరు "మహారాజా! కాలు యెముకలు విరిగిపోయినట్లుంది. కాలు తీస్తేగాని నీ కుమారుని కాలు నయమవదని చెప్పేశాడు. రాజుగారికి రాణీగారికి మతి పోయింది. వాళ్లు యేడుస్తూ కూర్చున్నారు. అయ్యో! ఒక్కకాని ఒక్కకొడుకు అని అందరు చెలికత్తెలు రాణిని ఓ దార్చసాగేరు.

ఈ సంగతి మేదరవానికి తెలి సింది. ఎలాగైనా ఈ రాజుకి బుద్ధి చెప్పవలెనని నిశ్చయించు కున్నాడు ఆ మేదరి. అతడు ప్రొద్దున్నే బయలుదేరి రాజుగారి దగ్గరకు వచ్చి "రాజా! నీ కుమా రుని కాలు పరిశుభ్రముగా బాగు చేస్తా" అని విన్నవించుకున్నాడు.

మహా మహా వైద్యులు చేయలేనిపని బీద మేదరి యెట్లా చేస్తాడని రాజు అతనిని చులకనగా మాట్లాడి పొమ్మన్నాడు. కాని రాజుగారి మంత్రి అందుల కొప్పుకొనక మేదరి వైద్యమునుకూడా చూడవలసిందని రాజుని ఒప్పించాడు.

రాజకుమారుని కాలుమీద మేదరి తన బుట్టలోని యేవో రెండాకులు పసరుతీసి రాసి ఆ ముద్ద వాపుమీద పెట్టి సన్నని వెదురు బద్దలతో కట్టుకట్టేడు. ఆ కట్టుతోనే బాధ బాగా నయమయింది.

ఆ మర్నాడు కట్టుకడదామని మేదరి వచ్చి చూచేసరికి రాజకుమారుడు కుంటుచూ నడవసాగేడు. మేదరి మరిరెండు కట్లు కట్టేసరికి రాజపుత్రుని కాలు బాగా నయమయింది.


రాజుగారు మేదరి నిపుణతకు సంతోషించి మేదరీ! నీ శక్తి సాటిలేనిది. నీవు నాకును నా వంశమునకును మేలు చేసేవు. నీకు కావలసినది కోరుము సంతోషముగా నిత్తును" అని చెప్పెను. అందులకు మేదరి నవ్వుచూ "దయాత్మా! మున్నొకసారి నా యిల్లు తగలపడిందని మొరపెట్టుకొని మీదగ్గరకొస్తే ఊరవతలకు తరిమివేశారు. అటువంటి బీద



వారిని నేనేమి అడగను? కాబట్టి నాకంటె అందరూ తెలివితక్కువ వారనియు బీదవారనియు గర్వించక ప్రజలనందరిని దయతో చూచుట మంచిది. మనకంటె అల్పమైనవాడైనను ఒకప్పుడు మనము చేయలేని పనిచేయ గలడు అని రాజుకి చెప్పి ఆ చోటు విడిచి పారిపోయెను.

రాజు విచారించి తన తప్పును తెలిసికొని యిదివరకు మేదర గుడిశ స్థానమందే మంచి గృహమును కట్టించి మేదరిని పిలిపించి అతని కిచ్చివేసెను. రాణి సంతోషముగా మేదరివానికి వేయి వరహాల నిచ్చెను. మేదరి గొప్పవాడయ్యెను. నాటినుంచీ రాజుగారబ్బాయి మేదరాడి కొడుకూ అన్నదమ్ముల్లాగ ఆడుకొనేవారట.

# కారు - విమానం ముగ్గులు



బాలా!

ఈ కారుఎక్కి——


కూర్పు: బి. అన్నపూర్ణ (చల్లపల్లి)

ఈ విమానం ఎక్కి

మదరాసు వచ్చి

"బాల" ప్రెస్సు

చూస్తావా?



కూర్పు: వి. హైమావతి (పెడన)

# కెరటాల కథ

రచన : నూరిశెట్టి జీవరక్షణరావ్ (అనకాపల్లి)

బాలలూ!


బీచిదగ్గర కెళ్లిచూస్తే మీకు కెరటాలు కనిపిస్తాయ్ గదూ? ఆ కెరటాల్నే "అలలు" అంటారు. ఆ అలల్లో తెల్లటి నురగ కూడా కనపడుతుంది. ఈ నురగ ఎలా వచ్చిందో తెలుసా! ఈ క్రింది కథ చదవండి. తెలుస్తుంది.

అనగా అనగా సముద్రంలో ఒక రాజమహాలుండేది. అది సముద్రరాజుది. సముద్రరాజుకి ఏడుగురు కుమార్తెలున్నారు. మాంచి అందంగావుండేవారు. వాళ్లలో ఆరుగురికి సముద్ర ప్రాణుల్తో పెళ్లిళ్లయిపోయాయి. ఏడవ కూతురు పేరు సుందరి. సుందరికి పెళ్లికాలేదు. "సుందరి" బాలకావటంచేత అందరికీ ముద్దుగావుండేది. సుందరి వాళ్ల అమ్మమ్మ ఒళ్లోకూచుని మన దేశపు కథలను వింటూండేది. సూర్యుణ్ణిగురించి, మనుష్యుల్ని గురించి వినేటప్పుడు మనదేశం చూడాలనిపించేది సుందరికి. ఒక నాడేమైందో తెలుసా! సుందరికి వాళ్లమ్మమ్మ మద్రాసునుంచి "బాల" వస్తోందని అందులో గమ్మత్తులూ, కథలూ వుంటాయని చెప్పింది. ఆమాటవినీ వింటంతోనే బాలకావాలనీ, మనుష్యులదేశం చూస్తానని పట్టు పట్టుకూర్చుంది. ఒకనాడు నీటి మీదికి వెళ్లడానికి వాళ్ల నాన్న గారి నడిగింది. ఆయన సుందరి సహాయంకోసం కొన్ని పెద్ద చేపలను, కొన్ని నీటి జంతువుల్ని వెంటపంపించాడు.

కొంతసేపటికి నీటిపైకి వచ్చింది సుందరి. మొట్టమొదట ఒక ఓడను చూసింది. ఆ ఓడలో కొందరు ఆడటం, మరికొందరు పాడుకుంటూండటం చూసింది. ఓడ తెరచాప కొయ్యదగ్గర ఆ దేశపు రాజకుమారుడు నిల్చున్నాడు. సుందరి అతన్ని ప్రేమించింది. ఇదంతా నీట్లోనుండే చూస్తోంది. ఓడ తమవేపే వస్తోంది. అందులో ఒక తిమింగలం కదలకుండా అలాగే వుండిపోయింది. తిమింగలమంటే

తెలుసా! మొసలిలాగే వుండే పెద్ద నీటి జంతువన్నమాట. అప్పుడేమైందనుకున్నారేమిటీ? తిమింగలంపైబడి ఓడ తిరగబడి నీటిలో మునిగిపోయి ముక్కలై పోయింది. అంతా నీటిలో మునిగి పోయారు. ఆ రాకుమారుడు కూడా మునిగిపోతున్నాడు. ఇది చూసి సుందరి భయపడింది. వెంటనే రాకుమారుడు దగ్గరకు వెళ్లింది. సుందరి వెళ్లకపోతే రాకుమారుడు మునిగిపోవలసిందే నన్నమాట. రాకుమారుడికి తెలివి తప్పింది. సుందరి అతన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పడుకోబెట్టి అతనికి తెలివిరావడానికి కావలసిన ఉపచారాలన్నీ చేసింది. ఇంతట్లోనే ఎవరో మనుష్యులు వస్తున్నట్టు శబ్దం వినిపించింది. సుందరి భయపడిపోయి నీటిలోనికి పోయి ఏమిటి జరుగుతుందో అని చూట్టం మొదలెట్టింది.

ఒక చక్కని యువతి రాకుమారునిదగ్గరకు రావటం చూసింది సుందరి. ఆ రాకుమారి తన చెలికత్తెల్ని పిలవగా వచ్చారు. వాళ్లుకూడా రాకుమారునికి తెలివి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలివి వొచ్చేక ఒడ్డునే వున్న ఒక భవనంలోనికి తీసుకపోయారా రాకుమారుణ్ణి. ఇదంతా చూస్తూనేవుంది సుందరి.




అందుచేత తిన్నగా తనతోటి వాళ్లతో యింటికి వచ్చేసింది. సుందరి ఎవరితోనూ మన దేశం గురించి ఏమీ చెప్పలేదు. ఇప్పు డామె విచారంగావుంది. తన తల్లిదండ్రులకు ఏమీ చెప్పక పోయినా తన అక్కలతో రా కుమారుని సంగతంతా చెప్పింది. ఆ రాకుమారుడు లేకుండా వుండ లేనంది. వాళ్లందరంటే మహా యిష్టం. అందుచేత తమ చెల్లెలి క్షేమంకోసం సుందరిని తీసుకుని నీటిమీాదికి వచ్చారు. వాళ్లారు గురిలోను ఒక్కరికిమాత్రమే ఆ రాకుమారుని సంగతి బాగా తెలుసు. అతని సంగతి మిగతా వాళ్లకి చెప్పిందామె. సుందరి ఆరాత్రంతా సముద్రంలోనుంచే రాకుమారుణ్ణి చూస్తూకూచుంది. రాకుమారుడు సుందరిని చూచి ఎవరో సముద్రంలో స్నానం చేస్తున్నారు కాబోలు అను కున్నాడు. నాకీ తోకకి బదులుగా కాళ్లుంటే భూమిమీాదికి పోయి రాకుమారుణ్ణి కలుసుకుందు నను కుంది సుందరి. ఆ వెంటనే సుందరి సముద్రంలో వుండే ఒక మాంత్రి కుడిదగ్గరకుపోయి సంగతంతా చెప్పి తోకకి బదులు కాళ్ల నిమ్మంది. అతనొక రసాన్నిచ్చి అది త్రాగితే తోక కాళ్లుగా మారుతుందనీ, నడిచేటప్పుడు కొంచెంనొప్పిగావుంటుందని, రా కుమారుడు ఆమెను పెండ్లిచేసు కుంటే మనిషి శరీరం వస్తుందని, అప్పుడు నొప్పి వుండదని, లేదా రాకుమారుడు మరొకర్ని పెండ్లా డితే సుందరి తెల్లవారేసరికి తెల్లటి ఉప్పులాంటి పదార్థంగా మారిపోయి ఎప్పుడూ సముద్రపు టొడ్డునే వుంటుందని చెప్పాడు.

ఇది విని రాకుమారుణ్ణి పెళ్లాడ నైనా పెండ్లాడ తాను; లేదా లోకంకోసం చావనైనా చస్తా ననుకుంది సుందరి. తన మంత్ర శక్తివల్ల సుందరి నా రాకుమా రుడు పెండ్లాడడని తెలుసుకుని ఇందుకు బదులుగా ఆమె నాలుక నిమ్మన్నాడా మంత్రగాడు. మొదట భయపడినా రాకుమా రునికోసం యిచ్చేసింది తన నాలు కని. వెంటనే మరో సీసాతో మరొకమందిచ్చి చీకటిపడ్డాక నీటి పైకి పోయి దీనిని త్రాగమని చెప్పాడు. అది తీసుకుని ఒడ్డుకు వచ్చేసింది సుందరి. ఆ మందు



త్రాగివేయగానే సుందరికి గాఢంగా నిద్రవచ్చింది. ఆ మరుసటి రోజున లేవగానే తోకకి బదులుగా అందమైన రెండు కాళ్లు రావటంచూసి సంతోషం పట్టలేకపోయింది. సుందరిని చూసి రాకుమారునికి సంతోషం పట్టలేక తన మేడలోనికి తీసుకపోయాడు. సుందరి నడిచేటప్పుడుకాళ్లు నొప్పిపెట్టేవి. కాని రాకుమారుడి దగ్గర వుండటంచేత ఆ బాధనంతా మరచిపోయింది. నాలుక లేకపోవటంచేత సుందరి మాట్లాడలేకపోయింది. పాడలేకపోయింది. కాని ఆమె అందం దగ్గర అప్సరసలుకూడా పనికి రాకుండా పోయారు. రాకుమారుడు సుందరిని స్నేహితురాలిగా తీసుకున్నాడు. కాని పెండ్లాడలేదు. ఎందుకంటే అతను మరొకర్ని పెళ్లాడడానికి ఇదివరకే మాట ఇచ్చాడు. సుందరి చాలా నొచ్చుకుంది.

పెండ్లినాడు మంచి బట్టలు కట్టుకున్నా విచారంగానే వుంది సుందరి. ఆ మరుసటి రోజునే తను నురగగా మారిపోతానని తెలుసు నామెకు. పెళ్లినాడు సుందరిచేత నాట్యం చేయించాడా రాకుమారుడు. నాట్యం చేసేటప్పుడు కాళ్లు చాలా నొప్పిపెట్టినయ్. పెళ్లయిపోయింది. ఎవరిండ్లకు వారు పోయారు. సుందరి మాత్రం తన అక్కల్నీ, తల్లిదండ్రుల్నీ, అమ్మమ్మనీ తలచుకొంటూ సముద్రపుటొడ్డున నిల్చుంది. సూర్యుడుదయిస్తున్నాడనగానే ఆమె నీటిలో పడిపోయి నురగగా మారిపోయింది.




పాఠశాల యందు ఫస్టు మార్కులు పొందు
తెలివి కలుగు సుమ్మ తెలుగు బిడ్డ
చదువు చుండు యెపుడు చక్కగాను బాలను
ఆటలాడు కొనుచు ఆంధ్ర బాల !

కాఫీ టీలు మాని కడుపునిండ తినుము
సాంట రిడ్లి మాని చద్ది తినుము
ఆవు పాలుత్రాగి ఆడు కొనుము హాయి
హాని కలుగ దింక ఆంధ్ర బాల !

పాఠశాల మాని పరుగెత్తకు సుమ్మ
జరిగిపోవు దినము తిరిగి రాదు
చెప్పబోరు మరల చెప్పిన పాఠంబు
ఆలకించు మన్న ఆంధ్రబాల !

చదువు రానియెడల ముద్దుగా పిలువరు
యింట వీధిలోన యెందుకూడ
పెట్టబోరు యేమి పిండివంటలసలు
ఆలోచించి చూడు ఆంధ్రబాల !



## (వి)నాయకుని విచారం!

నారదుడు ; "ఓ లంబోదరా ? ఏమిటి ఈ విపరీతం! తలను మణికిరీటం ఏదీ ? అంకుశం ఏదీ ? ఇదేమిటి నీ వేషం ఇలామారింది! నీ చవితిలాభాలు బాగున్నవా?"

*

*

వినాయకుడు :

అయ్యో ! నారదా ! నన్ను "లంబోదరా" అనడం చాలా అన్యాయం. రేషనింగువలన నా బొజ్జ కరిగిపోయింది. ఈ రోజుల్లో ఈ వేషం వేయాలి మరి ! నాకంటే ఆ ఎలుకేనయం! చీకటిబజారు కొట్లోదూరి బాగా మెక్కివచ్చింది !






రచన: బి. వి. మహాలక్ష్మీదేవి (కన్నపాలెం)

బాలా!

వినాయకుని గురించి నీవు ఎన్నోకథలు వినివుంటావు. ప్రత్యక్ష వినాయకునికథ ఎప్పుడైనా విన్నావా? ఇదిగో చదువు.

బాలకృష్ణుడు మీ అందరికీ తెలిసినవాడే. వాడుచేసిన అల్లరి పనులకు గోపికలంతా ఏడ్చుకొని, యశోదతో చెప్పుకున్నారు. ఈ తుంటరికృష్ణుని అల్లరికి యశోద చాలా విచారించి, ఏమీ తోచక, ఏనోము నోస్తే పిల్లవాడు అల్లరిలేకుండా వుంటాడో అని విచారిస్తూ కూర్చుంది.

ఇంతలో నారదుడు అక్కడికి వచ్చాడు. "ఏమమ్మా! యశోదమ్మా! అలాగ విచారంగా వున్నావు?" అని అడిగాడు.

"స్వామీ! మా అబ్బాయి అల్లరి పనులు చేస్తాడని ఊవూరి ఆడవాళ్లంతా ప్రతీరోజూ నేరాలు చెప్పగా నేను వినలేకుండా వున్నాను. మాఅబ్బాయి దుడుకు పనులు పోయేటట్లు ఏదైనా వ్రతముఉందా?" అని యశోద అడిగింది.


అప్పుడు నారదుడు ఆలోచించి భాద్రపద శుద్ధచవితినాడు వినాయకుని శ్రద్ధగా పూజించినట్లయిన మీకృష్ణుడు అల్లరిమాని బుద్ధిమంతుడు అవుతాడు అని చెప్పి దీవించి వెళ్లిపోయాడు.

ఈ సంగతి యశోద కృష్ణునితో చెప్పి "నాయనా! నీవు వినాయకుని పూజించినట్లైతే గోపికలు నీపై వేసిన నిందలు పోయి మంచివాడవనిపించుకుంటావు అనగా కృష్ణుడు "అమ్మా! వినాయకుడంటే ఎట్లా వుంటాడే? ఆయన ఏమియెక్కి వస్తాడే?" చెప్పవే? అంటే, అప్పుడు ఆమె "వినాయకునికి పెద్దబొజ్జ వుంటుంది. ముక్కే పెద్ద తొండముగావుం

టుంది. చెవులు చేటలు మాదిరిగా వుంటాయి. పొట్టిగా వుంటాడు. తెల్లని పట్టుబట్ట కట్టుకుని మగఎలుకమీద (అనగా పంది కొక్కు) ఎక్కి తిరుగుతూ వుంటాడు అని చెప్పింది.

అప్పుడు కృష్ణుడు ఎప్పుడు వినాయకుడు వస్తాడా! ఎప్పుడు చూస్తానా! ఎప్పుడు పూజ చేస్తానా అని ఆత్రంతో ఆరోజు కొరకు ఎదురుచూస్తూ వున్నాడు.

అంతట యశోదమ్మ వ్రతము చేయుటకై ఇల్లు శుభ్రపరచింది. సున్నముకొట్టించింది. గడపలకు పసుపు కుంకుమ పెట్టించి తోరణములు గట్టించింది. రేపు వ్రతమనగా కూరగాయలు పెరుగు పాలు మొదలైనవి అన్ని సిద్ధపరచింది. వూరివారందరిని భోజనములకు పిలిచింది. రకరకాల పిండివంటలు వుండ్రాళ్లు, మొదలైన అనేక విధములైనవి చేయించింది. వండిన పదార్థములన్నీ జాగ్రత్తగా ఒకగదిలో వుంచి తలుపు తాళము వేసింది. వ్రతము చేసేచోట చక్కగా



ముగ్గులుపెట్టి అలంకరించి మందిరం ఏర్పాటుచేసింది.

అప్పుడు కృష్ణుడు "అమ్మా ఆకలివేస్తోందే! ఇంకా వినాయకుడు ఎప్పుడు వస్తాడు." అని నిమిష నిమిషానికి అడగడం మొదలెట్టాడు. అప్పుడు యశోద కాస్త ఆగవమ్మా పూజచేసుకుని బువ్వతిందువుగాని" అని బ్రతిమాలింది.

వూళ్లోవాళ్లు ప్రతి యింట్లో వినాయకపూజచేసుకుని యశోదమ్మగారి యింటికి భోజనానికి వెళ్లాలని వుండ్రాళ్లు మొదలైనవి సిద్ధము చేయుచుండిరి. ఇక్కడ కృష్ణుడు "అమ్మా! ఆకలే!" అని గోలచేస్తూ వున్నాడు.

ఇంకా బ్రాహ్మణులు పూజ చేయించుటకు రాలేదు. కృష్ణుడికి ఆకలి ఎక్కువైపోతోంది! "సరే! వినాయకుడు నాకంటే గొప్పవాడా? చూస్తా యీ తమాషా"—అని కృష్ణుడు మనసులో అనుకొని. మాయ రూపంలో పిండివంట గదులోనికి దూరాడు. అక్కడ తనకిష్టమొచ్చినంత తిని, తిరిగి మూతలు పెట్టి, ఏమీ ఎరగనట్టుగా ఇవతలకువచ్చి: అమ్మా! ఆకలే! ఆకలే!" అని గోలచేశాడు. పన్నెండు గంటలయింది! ఇంకా బ్రాహ్మణుడు రాలేదు. కృష్ణుడి అల్లరి ఎక్కువయి పోతోంది. ఇంతలోకీ ఒక గమ్మత్తు జరిగింది.

ఒక పెద్దబొజ్జ, తొండము, పెద్ద చెవులు కిరీటము మొదలైనవి పెట్టుకొని, ఎలకమీదఎక్కి ఒక వినాయకుడు యశోదమ్మగారింటికి వచ్చాడు. వచ్చి తిన్నగా వ్రతంకోసం చేసిన మంటపంలో కూర్చున్నాడు!

"ఆహా! వినాయకుడు ప్రత్యక్షంగా వచ్చాడే!" అని యశోదమ్మ కంగారుపడి, గబగబ ఆ వినాయకుడికి పూజించి, నైవేద్యంకోసం, గదితలుపు తెరిచి చూచింది. ఆహా ఆశ్చర్యం! గదితాళం వేసేవుంది; పెట్టిన మూతలు పెట్టినట్టుగానే వున్నాయి-కాని అందులో పిండివంటలు మాయమయినాయి!

ఏమిటి యీ విచిత్రం! వినాకుడికి నైవేద్యం ఎలాగ ఇవ్వడం! అని ఆ యశోదమ్మ కంగారుపడి పొరుగింటికి వెళ్లింది.

ఆశ్చర్యం! ఆపొరిగింట్లోకూడ

ఒక ప్రత్యక్ష వినాయకుడు కూర్చొని వున్నాడు. అలాగే ప్రతిఇంట్లోనూ ఒక్కొక్క వినాయకుడు ప్రత్యక్షం! అందరి ఇళ్లలోనూ పిండివంటలు మాయమయినాయి! యశోద కంగారు ఎక్కువయింది. తిరిగి ఇంటికివచ్చి చూచింది. ఇంట్లో యీసారి ఎక్కడచూచినా వినాయకులే! ఎక్కడచూచినా వినాయకుని వాహనములే (అంటే ఎలుకలే!)

వీధిలోనికి వచ్చి చూస్తే ప్రతి ఇంట్లోనూ అలాగే! ఇందు గలడందులేడన్నట్లు వినాయకుల మయం అయిపోయింది. వినాయకుని వాహనం అయిన ఎలుకలు ఇళ్లల్లో దూరి బట్టలు, పెట్టెలు, బుట్టలు, చాటలూ అన్నీ చిందరవందర చేసేస్తు



న్నాయి. బియ్యం పప్పు వగయిరాలు తినేస్తున్నాయి!

అప్పుడు యశోదమ్మ "ఇదేమి వ్రతమమ్మా! నేనిప్పుడేమి చేసేది! ఆనారదుడు ఎంతమోసం చేశాడు!" అని ఆలోచిస్తూ వుండగా నారదుడు ప్రత్యక్షమయాడు.

"యశోదమ్మా! ఎందుకలా కంగారు పడుతున్నావు?"

అని నారదుడు నవ్వుతూ

అడిగాడు.

"అయ్యో నారదా! వచ్చావా! నీవు చెప్పినప్రకారం వ్రతం చేస్తే చూడు ఏమి జరిగిందో!" అని అంతా చూపించింది.

నారదుడు పకపకా నవ్వి: "అమ్మా! యశోదమ్మా! నీవెంత పిచ్చిదానవమ్మా! నీ కొడుకు కంటే వేరే దేముడున్నాడా? బాలకృష్ణుని అల్లరి సామాన్యమైనదా? ఆ అల్లరి మాన్పించడానికి మన తరమా? ఇదంతా ఆ బాలకృష్ణుని లీలలే!" అని చెప్పి వెళ్లిపోయాడు.


తుంటరి కృష్ణుడు పకపక నవ్వుతూ నిలుచున్నాడు. అందరూ ఆకృష్ణుని మాయ తలచుకొని కళ్లుమూసుకొని ఒక్కసారి ధ్యానించారు. కళ్లు తెరచి చూచేసరికి, వినాయకుడు, వాహనములు అన్నీ మాయమయిపోయాయి.

ప్రజలందరూ కలిసి సంతోషముతో యశోదమ్మ ఇంట్లో వినాయకుడిపూజ చేశారు. చిన్నికృష్ణుడుకూడా పూజ చేశాడు. ఎందుకో తెలుసా? తన అల్లరికి విఘ్నం కలగకుండా వుండాలనిన్నీ, ఎల్లప్పుడూ పాలూ, వెన్నా, జున్నూ దొరుకుతుండాలనీ ప్రార్థించాడు.

బాగుందా యీ కథ?


## వినాయకప్రార్థన నేర్చుకొండి

శుక్లాంబర ధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే
త్సర్వ విఘ్నోప శాంతయే ॥





స్వర్ణోత్సవ వికాసము
నర్తనశోభ
Golden Jubilee
పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతము
జీవామృతము
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్
(స్థాపితము 1898)
మద్రాసు. 17

నేను జీవించెదను
జమ్ము వెంకట-రమణయ్య
లివర్ క్యూర్
జమ్ము వెంకటరమణయ్య & సన్సు



# లండన్‌లో మోహన్

రచన: సిద్ధాంతి మల్లికార్జునం [బి. ఎ. బి, యిడి.]

[బాలా! క్రిందటినెల బాలలో మోహన్ లండను వెళ్లడం, అక్కడ తనస్నేహితుడు జాన్‌ను కలుసుకోడం, జాన్ తనబడి చూపించడం, తరువాత వాళ్ల హాస్టలు చూపించడం, ఆ హాస్టలులో మోహన్‌కి వాళ్లు చూపిన మర్యాదఅన్నీ చదివారు. ఆ సాయంత్రం 3 గం॥ లకు అందరూ కలిసి సినీమా చూడడానికి వెళ్లారు. ఇక చదవండి.]

ఆ హాస్టల్లోనే పిల్లలకు ప్రత్యేకంగా వారానికొకసారి సినిమా చూపిస్తారు. అందరు వెళ్లి ఆ హాల్లో కూర్చున్నారు. మోహన్ జాన్ పక్కనే కూర్చున్నాడు.

"మోహన్ మనం చూచే సినిమా పిల్లలకొరకు వేరేగా తయారుచేసింది. మా దేశంలో పిల్లలకొరకు ఇలాంటి చిత్రాలు ఎన్నో తయారుచేస్తారు. బడిపిల్లలకవన్నీ ఊరికనే చూపెడ్తారు. మీ దేశంలో చూపిస్తారా?"

"లేదు. మా దేశంలో ఇటువంటి వేమీ లేవు. డబ్బుపెట్టుకొని మేముకూడా పెద్దవాళ్ల సినిమాలే చూడాలి." అని చాలా కోపంగా అన్నాడు మోహన్. "మీ దేశంలో పద్ధతులు చాలా బాగున్నాయి జాన్. ఇవన్నీ చూస్తూంటే నాకిక్కడే వుండి చదువుకోవాలనిపిస్తుంది."

"మరి మీనాన్నగారు ఒప్పుకుంటారా మోహన్?" "ఏమో, తెలియదు." ఇంతలోకే సినిమా ప్రారంభించారు.

"జాన్!" అన్నాడు మోహన్. "ఏమిటి నువ్వేనా?" అవును అన్నాడు జాన్ నవ్వుతూ. మొదటి సీనులో పరుగెత్తుకుంటూవచ్చి చాలా ఎత్తు

నుంచి నీళ్లలోకి దూకుతాడు జాన్. నీళ్లలోమునిగి, దూరంగా తేలి ఈతకొడుతూంటాడు. పిల్లలందరు చప్పట్లుకొడ్తారు.


"మోహన్. మా బళ్లో పిల్లలు, ఇంకా ఇతరబళ్లలో పిల్లలు, వీళ్లందర్నిచేర్చి, రకరకాలు సినిమాలు తయారు చేస్తారు. ఇంకానాడు మనచుట్టు కూర్చున్నపిల్లలందరు సినిమాలో కనిపిస్తారు. అదుగోనాడు అని జాన్ అంటుండగా ఒక్కగుంపు, మొగపిల్లలు ఆడపిల్లలు, ఎగిరి నీళ్లలో గంతేసి ఈతకొడ్తారు. రెండవ సీనులో ఫుట్ బాల్ మ్యాచి, బ్యాట్ మింటన్, క్రికెట్, పరుగెత్తే పందేలు, సైకిళ్లు తొక్కడం, మొదలైనవన్నీ చూపించారు.

"అవన్నీ మాబళ్లో స్పోర్ట్సు జరిగేటప్పుడు తీసిన చిత్రాలే."

"జాన్, అదుగో అక్కడ పరుగెత్తేది నువ్వేనా?"

"అవును, మా హాస్టల్ పిల్లలందరు కనిపిస్తున్నారా?"

"ఆఁ. ఈ సినిమా బలే



బాగుంది జా.న్ " మూడవ సీనులో, పిల్లలందరు డ్రిల్లు చెయ్యటం, పడవల్లో నదులమీద చెరువులమీద షికారు వెళ్లటం. పడవ నడపటంలో పందాలు, సముద్రస్నానం, ఇంకా ఇలాంటి వెన్నో చూపించారు. ఇవన్నీ చూస్తూవుంటే మోహను, నాన్నని, అమ్మనీ, మెడ్రాసునీ పూర్తిగా మరచి పోయ్యాడు. అటువంటి సినిమా అతనెక్కడా ఎప్పుడూ చూడలేదు.

"నీకు ఈత వచ్చునా మోహను?"

"రాదు?"

"అరే. మాబళ్లో అందరికీ ఈత నేర్పిస్తారు. నేర్చుకుంటావా?"

"ఓ." అన్నాడు మోహను.

సినిమా అయిపోయిన తర్వాత అందరిదగ్గర శలవుతీసుకొని, ఇద్దరు కారులో వెళ్లారు.

"నాకుగూడా సినిమాలో చేరాలనివుంది జాను"

"ఇంక వారంరోజుల్లో మరొక సినిమా తీస్తారు. అప్పుడు నీవు కూడా దాంట్లో చేరుదూగాని" మోహను సంతోషం పట్టలేక పోయ్యాడు. వీళ్లిలా మాట్లాడుకుంటూండగా జానుగారిల్లు వచ్చింది. ఇద్దరు కారుదిగి లోపలికివెళ్లారు. జాను తల్లి దండ్రులు మోహన్నిచూచి చాలాసంతోషించి అతనికి చాలా పుస్తకాలు బొమ్మలు ఇచ్చారు. అక్కడ మళ్లీ కొంచెం ఫలహారంచేసి, ఇద్దరు రేడియోస్టేషనుకు వెళ్లారు. ఇంగ్లండులో రేడియో స్టేషనుకు బి. బి. సి. అనిపేరు. ఆనాడు పిల్లల ప్రోగ్రాం వుంది. అక్కడ ఆడపిల్లలు మొగపిల్లలు కలిసి ఎన్నోకథలు, పాటలు, రేడియోలో చెప్పారు. మోహను ఒక ఇంగ్లీషు పద్యం చదివాడు రేడియోలో. అతన్ని చూచి అక్కడి పిల్లలందరు సంతోషించి, అతని కందరు స్నేహితులైనారు.

అదంతా అయిన తర్వాత, కారులో మోహన్ని తీసుకవచ్చి ఇంట్లో వదలిపెట్టి వెళ్లాడు జాను. ఆ రాత్రంతా పగలు చూచిన వన్నీ కలలో కనిపించాయి మోహనుకు.

నెలరోజులపాటు మోహను లండన్‌లో వున్నాడు. ఆ నెల రోజుల్లో, మోహన్ ఈతనేర్చుకున్నాడు. రేడియోలో, మరొక

సారి తెలుగుపాటలు పద్యాలు చదివాడు. సినిమాలో వేషం వేశాడు. ఇంకా ఏన్నో చేశాడు. లండనుకంటె మంచివూరు ఇంకెక్కడా లేదనుకున్నాడు మోహను. అక్కడే వుండిపోవాలనుకున్నాడు. అయితే వాళ్ల నాన్న ఒప్పుకోలేదు. మోహన్ ఇండియాకు తిరిగివచ్చేనాడు జాన్ మళ్లీ వచ్చాడు. ఇండియాలో తన స్నేహితుల ఫోటోలు, తను తీసిన ఫోటోలు, తన స్నేహితులు రాసిన ఉత్తరాలు, వాళ్లు పంపిన బహుమతులు, అన్నీ మోహనుకు చూపించాడు. వాళ్లిద్దరు వెళ్లి ఫోటో తీయించుకున్నారు.

"మోహను మా వూరు, బాగుందా?"

"చాలా బాగుంది జాన్ నాకిక్కడే చదువుకోవాలనుంది. మానాన్న వద్దన్నాడు.

"మీనాన్నగారి మాటవిను. మద్రాసులోనీ చదువైన తర్వాత నీవిక్కడికి రావచ్చు. అప్పుడు మనిద్దరం ఒకేబళ్లో చదువుకుందాం. ఏం"?

"అలాగే" అన్నాడు మోహన్.

"నీవొక పని చెయ్యాలి



మోహన్."

"ఏమిటి?"

"చూడు. మీ దేశంలో పిల్లలందరు చాలా మొరటుగా వుంటారు. సోమరులు, వాళ్లు తెలివికల వాళ్లే కాని, మంచి అలవాట్లు వాళ్లకు లేవు. మా దేశంలో పిల్లల్ని చూచావు గదా. ఎంత చక్కగా వుంటారో చూడు. మీ దేశంలో వాళ్లుగూడా ఇలాగే వుండాలి. అప్పుడే మనందరికి బాగా స్నేహం కలుగుతుంది. లేకపోతే మా దేశంలో పిల్లలందరు మీ దేశంలో పిల్లల్ని ఎగతాళి చేస్తారు."

"అవును. మళ్లీ వాళ్ల దగ్గరికి వెళ్లి క్లాసులో వాళ్ల పక్కన కూర్చోవాలంటే నాకు అసహ్యంగావుంది జాన్."

"అలా అనవద్దు మోహన్. వాళ్లకింకా ఏమీ తెలీదు. నీలాగ వాళ్లూ లండనుకువస్తే అన్నీ బాగా తెలుసుకుంటారు. నీవు వెళ్లి ఇక్కడ చూచినవన్నీ వాళ్లకు చెప్పి వాళ్లందరినీ బాగు చెయ్యాలి. సరేనా మోహన్."

సరేనని మోహన్ తల ఊపాడు.

"మీ రెప్పుడు వెళ్తారు?"

"సాయంత్రం. 5 గంటలకు."

"సరే నేను హార్బరు దగ్గర నిన్ను మళ్లీ కలుసు కుంటాను. గుడ్ బై." అంటూ జాన్ వెళ్లాడు.

సాయంత్రం, 4 గంటకు జాన్ హార్బర్ దగ్గరికొచ్చాడు. స్టీమరెక్కి మోహన్ వాళ్ల గదిలోకి వెళ్లాడు. బిస్కట్ పొట్లాలు, చాక్లేట్సు, ఫౌంటెన్ పెన్ను, బ్యాటరీలైటు, పిల్లల బొమ్మల పత్రికలు, మొదలైనవన్ని మోహానుకు బహుమానంగా ఇచ్చాడు జాన్.

"జాన్, మీ దేశంలో మంచి మంచి పిల్లల పత్రికలు నాకు పంపిస్తా ంటావా?"

"అలాగే. మరినీ "బాల"ను కూడా నాకు పంపించు నేను తెలుగు నేర్చుకుంటాను."

"సరే" అన్నాడు మోహను.

"మద్రాసు చేరగానే ఉత్తరం రాస్తావా?"

"రాస్తాను."

అప్పుడే స్టీమరు కూత




కూసింది. "ఇక వెళ్తాను మోహాను. జ్ఞాపకం వుంచుకో." అంటూ షేక్‌హాండ్సు ఇచ్చాడు జాను. పాపం, మోహానుకు గప్పున ఏడుపు వచ్చింది. కళ్ల వెంబడి నీళ్లు కారాయి. జాను కూడా కొద్దిగా కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ఇద్దరు ఒకరి నొకరు ముద్దు పెట్టుకున్నారు.

"ఏడవ్వద్దు మోహాను, నేను చెప్పినట్లు చేస్తావా?

"అలాగే."

"వెరీగుడ్. నేను వెళ్తాను. గుడ్‌బై"

"గుడ్ బై" అన్నాడు మోహాను.

చేతిగుడ్డ విసురుతూ జాను స్టీమరు దిగి వెళ్లిపొయ్యాడు. జాను పోతూంటే అతన్ని చూస్తూ కాస్సేపు నిల్చున్నాడు మోహాన్.

స్టీమరు కదిలింది కొద్దిసేపటికే, కొద్దిరోజుల్లో మోహాన్ మెడ్రాసుకువచ్చి లండన్ లో చూచినదంతా రేడియో పిల్లల ప్రోగ్రామప్పుడు మాట్లాడుతాడట. బాలలోకూడా వ్యాసాలు, కథలుకూడా రాస్తాడట. జాగ్రత్తగా చదువు తారుగదూ!

# ఎన్నికోట్లు?

రచయిత : కె. కె. వెంకటరమణగుప్త

[బాలలో చాలామంది యుక్తిపరులున్నారు. యుక్తి అంటె కొంతమంది చిలిపి చేష్టలనుకుంటూరు. కానినిజంగా యుక్తి అంటె గొప్ప తెలివి. ఆ యుక్తిని మంచికి ఉపయోగించాలి.]

అనగా అనగా ఒక చక్రవర్తి వుండేవాడు. ఆ చక్రవర్తి మన దేశం వచ్చాడు. మన దేశం చాల భాగ్యవంతమైనదని పూర్వమునుండి ప్రసిద్ధికల్గింది. అందువల్ల మన దేశంలో ఎంతమంది భాగ్యవంతులున్నారో తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది.

అందుకుగాను ఆయన ఒక గంటను, కచ్చేరివద్ద పెట్టించి యిట్లా ప్రకటన చేశాడు.

"ఈ దేశములో ఒకకోటి రూపాయలున్నవా రొక్క-గంట, రెండుకోట్లున్నవారు రెండు గంటలు, ఈ విధంగా ఎవరెవరికి ఎన్నెన్ని కోట్లుంటే అన్నిగంటలు కొట్టాలి. అట్లు కొట్టినవారి భాగ్యముజూచి వారికి గౌరవము కలుగచేయుదుము" అని.

ఈ ప్రకటనచూచి దేశంలోని భాగ్యవంతులందరు వెళ్లి, ఎవరెవరికి ఎన్నికోట్ల ధనంయుందో అన్నిగంటలు కొట్టి ఆ చక్రవర్తి వద్ద తగిన గౌరవమర్యాదలు పొందుతున్నారు.

ఒకనాడు స్కూలునుండి పిల్లలంతా ఇంటికి పోతున్నారు. ఆ పిల్లల్లో కృష్ణారావు అనేవాడు ఒకడు. వాడు చాల తెలివిగలవాడు. అల్లరి, చదువులోకూడ తెలివివంతుడే.

కృష్ణారావు ఆ వూరిలో ఒక సామాన్య వ్యాపారికొడుకు. అతడు కచేరిముందరనుంచే తన యింటికి పోతున్నాడు.

ప్రతి భాగ్యవంతుడు వచ్చి గంటకొట్టడము, వాళ్లను జవానులు గౌరవంగా లోపలికి దీసికొని పోవడం చూచాడు. ఎందుకు వారలా గంటలు కొడ్తున్నారని అచ్చటయుండే జవాన్ని అడిగాడు.

"ఎవరికెన్ని కోట్లున్నాయో వారన్ని గంటలు కొట్టాలి. అటువంటి వారిని చక్రవర్తి గౌరవిస్తారు" అని ఆ జవాను చెప్పాడు.

"అలాగయితేచూడు" అని కృష్ణారావు ముప్పయి నలభయి గంటలను జవాను ఎంచుకోవటాన్కి వీలుకాకుండ గొట్టినాడు.

వెంటనే ఆ జవాను అతన్ని చక్రవర్తి వద్దకు దీసికొనిపోయినాడు. చక్రవర్తి ఆ పిల్లకాయనుచూచి "మీకెన్ని కోట్లున్నాయి" అని అడిగాడు.

"మాకు 50 కోట్లకుపైగా యున్నాయి."

"అట్లాయితే అవి మాకు చూపిస్తావా" అని చక్రవర్తి ఆశ్చర్యంతో అడిగాడు.

"రేపు మా యింటికివస్తే చూపిస్తాను." అని కృష్ణారావు ధీమాగా చెప్పినాడు.

"సరే"నని చక్రవర్తి కృష్ణారావుని తగిన మర్యాద చేసి వాళ్లింటికి పంపినాడు.

కృష్ణారావునాన్న, కృష్ణా



ావు చేసినపనికి చాల భీతిపడి
ాడు. కాని కృష్ణారావు
ూత్రం చాల సంతోషముగానే
ఉన్నాడు.

మరునటిదినం రాజు తగిన
రివారంతో కార్లో కూర్చొని
ృష్ణారావు యింటికి వచ్చాడు.
ృష్ణారావు చక్రవర్తిని ఒక గది
ోకి పిలుచుకొనిపోయి "ఎంచు
ొండి" అన్నాడు.

చక్రవర్తికి అక్కడ ఏమీ
రూపాయలు కనపడలేదు. అతనికి
నబడినవన్నీ కోళ్లే. అవి
మామూలుగా ధరించేవి. "ఏదీ
ధనం?" అన్నాడు చక్రవర్తి.

"మీరు నన్నడిగినది కోళ్లే
గాని రూపాయలు గాదు"
అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.

ఈ మాటతో రాజుకూడ
నవ్వు వచ్చింది. ఆ బాలుని
తెలివికి చక్రవర్తి ఆశ్చర్య
పడ్డాడు. అతన్ని మెచ్చుకొని
గొప్ప బహుమతి నిచ్చాడు.

చూచినారా బాలల్లారా
మీలో యెంత తెల్విగల వారు
న్నారో!


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడు గారి

# బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు అండ్ బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు,

కుంభకోణం బ్రాంచి;
నెం. 7, సారంగపాణి కోవిల్
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం

చిట్టిపొట్టి కథ



# కోతి చేష్టలు


రచన: "అక్కయ్య"

అనగా అనగా ఒక అడవి.

ఆ అడవిలో ఒక కోతి. ఒకనాడు ఆ కోతికి దాహం వేసింది. మంచినీళ్ల కోసం ఆ అడవంతా తిరిగింది. తిరగ్గా తిరగ్గా తిరగ్గా, ఒకచోట ఒక గుంట కనబడింది. ఆగుంట దగ్గరకు వెళ్లి కడుపునిండా మంచి నీళ్లు తాగింది.

కోతి నీరు తాగుతున్నప్పుడు, అలా నీట్లో చూస్తూ వుంటే, తన నీడే నీట్లో కనబడింది. ఆనీడను చూచి, ఆకోతి అనుక్కుందీ, "ఛీ ఛీ, నే నెంత అసహ్యంగా వున్నానో! నాకీరూపు ఏమీ బాగు లేదు. ఈ ప్రపంచం అంతటికీ నేనే చక్కని దాన్నయితే ఎంత బాగుండును!" అని అనుకుంది.

ఇంతట్లోకి ఒకఏనుగు అలా వెడుతోంది. కోతి ఏనుగును చూచి, "ఆహా! ఏనుగూ నీ





తొండం ఎంత బాగుందో ! నాక్కూడా ఒక తొండంవుంటే ఎంత బాగుండును ! '' అంది.

తరువాత ఒక లేడి అలా వెళ్లింది. "ఆహా ! ఈ లేడి కొమ్ములు ఎంత బాగున్నాయో ! హుఁ...నా కా కొమ్ములుంటే నా-...." అనుకుంది కోతి.

"ఏమిటికోతీ ఆలోచిస్తున్నావూ" అని అడిగింది చెట్టు మీదవున్న ఒక గుడ్లగూబ.

"ఏంలేదు, గూబనేస్తం - నా రూపు ఏమీ బాగులేదు - నాకు ఏనుగు తొండంలాగ ఒక తొండంలేదు-లేడి కొమ్ముల్లాగా కొమ్ములూలేవు-నీలాగా, పోనీ, రెక్కలేనా వుంటే ఎంతో బాగుండును. రెక్కలు కూడా లేవు.'' అంది కోతి విచారంగా.

ఏమి ? నీరూపు బాగులేదూ- చక్కగా మెత్తగా పట్టులాగ ఒళ్లూ నువ్వూ ఎంతో బాగున్నావు! అంది గుడ్లగూబ.

అబ్బే! నారూపు ఏంబాగుంది. నారూపుచూస్తే నాకే అసహ్యం వేస్తోంది. గూబనేస్తం, గూబనేస్తం, నీలాగ నాకు కూడా రెక్కలు తెప్పించవూ ? అని ప్రతిమాలుకుంది కోతి.

గుడ్లగూబ చాలా తెలివైంది. ఆలోచించి, ఆలోచించి, "సరే ! నేచెప్పినట్టు చేస్తావా, నీకు రెక్కలొస్తాయి " అంది గూబ.


"ఓ ! తప్పకుండా చేస్తాను" అని ఒప్పుకుంది కోతి.


గుడ్లగూబ కోతిచెవిలో చిన్న రహస్యం చెప్పింది.

కోతికి ఒకటే సంతోషం. ఒక్క కుప్పిగంతువేసి లేచింది. ఆ గుంట దగ్గరికివెళ్లి బురదలో అటు ఇటూ దొర్లి ఒంటినిండా బంకమట్టి పట్టించుకుంది. దగ్గరలోవున్న ఒక బాతుయింటికివెళ్లి, బాతురెక్కలు తెచ్చుకుని, ఒంటి నిండా ఒత్తుగా అంటించుకుంది.

సాయంకాలం అయింది. అప్పుడే చీకటి పడుతోంది. కడుపులో ఆకలేస్తోంది. అమ్మ జ్ఞాపకంవచ్చింది. గబగబా యింటికి వెళ్లి తలుపుపిలిచింది. వాళ్లమ్మ తలుపుతీసింది. చూస్తే తన పిల్లకాదు. ఆ రూపే లేదు. ''ఛీ ఛీ నువ్వెవరు? నువ్వు నా పిల్లవికావు! ఫో ఫో'' అని తరిమేసి వీధి తలుపువేసేసింది.

''లేదమ్మా! నేను నీపిల్లనే!''





అని కోతిపిల్ల ఒకటే ఏడుపు. కాని ఏంలాభం? రెక్కలంటించుకున్న కోతిపిల్లని వాళ్లమ్మ పోల్చుకోలేక పోయింది.

ఆ రాత్రంతా తిండిలేక, ఆ కోతిపిల్ల ఏడుస్తూ వీధి అరుగు మీద పడుకుంది. మర్నాడు పొద్దున్నేలేచి. మళ్లీ ఆగుంటకు వెళ్లి, నీళ్లలో శుభ్రంగా స్నానం చేసి, ఆ రెక్కలన్నీ పీకిపారేసి, యింటికివచ్చింది తలుపుపిలుస్తే వాళ్లమ్మ తలుపుతీసింది. తనపిల్లని గట్టిగా కౌగలించుకుని, ముద్దుపెట్టుకొని, లోపలికి తీసుకువెళ్లింది. కడుపునిండా బువ్వ కలిపిపెట్టింది.

అప్పటినుంచి ఇప్పటివరకూ మళ్లీ ఆ కోతిపిల్ల లేనిపోని వేషాలు వెయ్యలేదట. కోతిచేష్టలన్నీ మాని హాయిగావుంది.

# వెద్దుమొద్దు స్వరూపాలు

రచన : కర్రా సూర్యనారాయణశాస్త్రి (మదరాసు)

పూర్వం ఒక వూళ్లో ఒక కాపు ఉండేవాడు. ఆ కాపు అత్తవారు తన పెళ్లాన్ని తన యింటికి పంపేటప్పుడు ఒక సేవకుణ్ణికూడా పంపారు. వాడి పేరు వెంకన్న. ఆ వెంకన్న నల్లగా ఉంటాడు కనుక నల్లెంకన్న అనిన్నీ, కొంచెం వెర్రి బాగులాడిలాగుంటాడు కనుక వెర్రెంకన్న అనిన్నీ, ఊళ్లో అందరూ పిలుస్తూండేవారు. నల్లెంకన్న మంచి నమ్మకమయిన మనిషి. దొంగతనం చెయ్యడు. అబద్ధం ఆడడు. కాని అదో రకంగా ఉంటాడు. వాడంటే ఆ కాపు పెళ్లానికి చాలా ప్రేమ. అందుచేత ఆ కాపు కూడా వాడంటే చాలా ప్రేమగా ఉంటూండేవాడు. ఒకరోజు ఆ కాపూ వెంకన్నా ఇద్దరూకూడా పొలం వెళ్లారు. పొలంలో కుప్ప నూరుస్తున్నారు. ధాన్యం రాసులు రాసులుగా పోస్తున్నారు. మధ్యాన్నం పన్నెండు గంటలయింది. కూలివాళ్లందరూ భోజనాలకి ఇళ్లకు పోయారు. అప్పుడు కాపు వెంకన్నతో వెంకన్నా! నేనింటికివెళ్లి భోజనంచేసి వస్తాను. తరువాత నువ్వు వెడుదువుగాని. నేవచ్చేదాకా ఈ ధాన్యపు రాసుల్ని ఎవరయినా తీసుకుపోతారేమో! జాగ్రత్తగా చూస్తుండు అన్నాడు. సరే వెళ్లిరండి జాగత్తగా చూస్తుంటాను అన్నాడు వెంకన్న. కాపు వెళ్లిపోయాడు. ఈ వెంకన్న సంగతి బాగా తెలిసి కొంతమంది కూలీలు దొంగవేషాలు వేసుకుని ధాన్యపు రాసుల్లోంచి ధాన్యాన్ని సంచీల్లోకి తీసుకుపోవటం ప్రారంభించారు. వెంకన్న జాగ్రత్తగా ఎంతమంది వచ్చారో ఎన్ని సంచులు తీసుకువెళ్లారో అన్నీ లెక్కపెట్టుకుంటున్నాడు. నాల్గు రాసుల ధాన్యానికి ఒక్క రాసి మాత్రమే మిగిలింది. ఇంక

కాపు వచ్చేసైమయిందని వాళ్లు తీసుకు వెళ్లటం మానేసారు.

కాపువచ్చి చూసాడు. ఇదేమిటి వెంకన్నా! ధాన్యం మూడు రాసులూ ఏమయ్యాయి! అన్నాడు. అప్పుడు వెంకన్న మీరు వెళ్లిన కొంచెం సేపట్లో నలుగురు మను





ష్యులువచ్చి ధాన్యం సంచీల్లోకి తీసుకు వెళ్లటం ప్రారంభించారు. అల్లా తీసుకుపోయిన సంచీల మొత్తం 82. తరువాత మళ్లీ రాలేదు. ఇంకా ఎవరైనావచ్చి తీసుకు వెడతారేమో అని జాగ్రత్తగా చూస్తున్నాను. ఇంతలోకి మీరు వచ్చారు అన్నాడు. ఓరి! ఎవళ్లో ధాన్యం తీసుకు పోతూంటే చూస్తూ ఊరుకున్నావా? అన్నాడు కాపు. మీరు జాగ్రత్తగా చూడమన్నారు. నేను చూసానండి. మీరు చెయ్యమన్నట్టు చేసాను. అని వెంకన్న అంటే చాల్చాల్లే ఎవరైనా తీసుకుపోతారేమో జాగ్రత్తగాచూడు అంటే అదా అర్థం. వాళ్లెవళ్లూ పట్టుకుపోకుండా ఆ వస్తువుని జాగ్రత్త చెయ్యక్కర్లేదా? నడు ఇంటికి వెళ్లి భోజనం చెయ్యి అని కాపు కోపంతో అన్నాడు. 'వస్తువుని జాగ్రత్త చెయ్యాలి', అనుకుంటూ వెంకన్న విచారంతో ఇంటికిపోయాడు.

మరికొన్ని రోజులయిన తరువాత ఒకనాడు ఆ కాపు పెళ్లాం తన పుట్టింట వాళ్లెల్లాగున్నారో చూసిరమ్మని వెంకన్నని పంపించింది. వెంకన్న వాళ్ల ఊరు కెళ్లి రెండు రోజులుండి మళ్లీ కాపు ఇంటికి బయలుదేరాడు. అప్పుడు కాపు అత్తగారు మంచి మంచి చీరలు ఒక సంచీలో పెట్టి తీసుకువచ్చి కూతురికిమ్మంది. వెంకన్న సరే

అన్నాడు. ఆవిడ వీధి గుమ్మం దాకా వచ్చి సంచీ జాగ్రత్త నాయనా! అని రెండుమూడు సార్లు చెప్పింది. సరే అంటూ వెంకన్న బయలుదేరాడు. దారిలో పెద్దవాన వచ్చింది. అప్పుడు వెంకన్న కాపు వస్తువు జాగ్రత్త చెయ్యాలన్నాడు. అత్తగారు సంచీ జాగ్రత్త అని చెప్పింది. కనుక మనం ఈ సంచీని తడపనివ్వకూడదు. అనుక్కని అందులో చీరలు రెండూ తీసి సంచీ తడిసిపోకుండా చుట్టబెట్టాడు. చీరలు తడిసి ముద్దయ్యాయి. ఇంటికి వచ్చాక ఏమండోయి! మీ అమ్మగారు నాచేతికి ఈ చీరల్ని ఈ సంచీలో పెట్టి ఇస్తూ సంచీ జాగ్రత్తని రెండుమార్లు నొక్కి చెప్పారు, సంచీ సరిగ్గా ఉందోలేదో చూసుకోండి! అని సంచీ చీరలూ ఇచ్చాడు. అవి పట్టుచీరలేమో బాగా తడియటంవలన చివికిపోయి నట్టయిపోయాయి. ఎంత పని చేసావురా బాబూ! నీకేం పని చెప్పకూడదు. అని ఆ కాపు పెళ్లాం కాపుతో జరిగిందంతా చెప్పింది. చాలా విచారించారందరూను.

మరికొన్ని నెలలయిన తరువాత ఒకరోజున కాపు పెళ్లాము పొరుగూరికి వెళ్లవలసి వచ్చింది. వెంకన్నని ఇంటికాపలాగాపెట్టి ఇవతల కవతలికి వెళ్లేటప్పుడు వీధి తలుపు జాగ్రత్త అని చెప్పి వెళ్లిపోయారు. సరే అని వెంకన్న జాగ్రత్తగా కాపలా కాస్తూ కూచున్నాడు. మధ్యాన్నం రెండు గంటలయ్యేసరికి ఆ వీధి చివరనుంచి దొమ్మరాట జరుగుతూంది. వెంకన్నకి అక్కడికివెళ్లి చూడాలనిపించింది. ఆట బలేగా ఉందని అందరూ చెప్పుకుంటున్నారు. కాపు వీధి తలుపు జాగ్రత్తని చెప్పాడు! ఏంచెయ్యాలో తోచిందికాదు. ఇంతట్లోకే ఒక చిన్న ఉపాయం అతగాడి బుర్రలో మెరపు మెరసి నట్లయింది. వెంటనే వీధి తలుపు దగ్గరకువెళ్లి అమాంతంగా దాన్ని ఊడదీసి తలమీద పెట్టుకున్నాడు. గబగబా దొమ్మరాట జరిగే స్థలంలోకివెళ్లి తలుపు క్రింద వేసుకుని దానిమీద కూర్చుని ఆటంతా సంతోషంతో చూసాడు. ఆటయిపోయాక




తలుపు జాగ్రత్తగా తీసుకువచ్చి వీధి గుమ్మానికి తగిలించి కాస్తూ కూచున్నాడు. కాపు పెళ్లాం సాయంత్రం వచ్చారు. వెంకన్న జాగ్రత్తగా కూచున్నందుకు చాలా సంతోషించారు. వీధి తలుపు తోసుకుని లోపలకు వెళ్లారు. వెడితే ఏముంది! ఇల్లంతా కాళీ! పెట్టెలు మంచాలు ఏమీలేవు. ఇదేమిటి వెంకన్నా! ఏంచేసావు చెప్పు అన్నారు. నాకేం తెలియదు బాబూ! మీరు చెప్పిన ప్రకారం ప్రొద్దుననుంచి ఇప్పటివరకు తలుపునే కనిపెట్టు కూర్చున్నాను. ఆఖరికి దొమ్మరాట చూడటానికి వెళ్లేటప్పుడు కూడా చచ్చినట్టు ఎంత బరువున్నా కష్టపడి తలుపు మోసుకు తీసుకువెళ్లి తీసుకువచ్చి తగిలించాను అని ఏడవటం ప్రారంభించాడు. అయితే ఆ సమయంలో ఎవడో ఇల్లంతా కాళీచేసాడన్న మాట! బాబూ! వెంకన్నా! నువ్వు రేప్రొద్దున్నే బయలుదేరి మీ ఊరు వెళ్లిపో. మా యింట్లో ఉండక్కర్లేదు. అని కాపూ పెళ్లామూ వెంకన్నని వాళ్ల ఊరు పంపించేసారు. ఎద్దు మొద్దు స్వరూపాలంటారు ఇల్లాంటి వాళ్లనే.

# బాల యోగి

రచన: మాడేటి కృష్ణమోహన్




బాలా! నీవు చాలా గమత్తు కథలు, వింతలూ విన్నావు కదూ? కాని ఈ క్రిందికథ ఎప్పుడైనా విన్నావో, లేదో, జాగ్రత్తగా చదివి నీ స్నేహితులకు కూడా చెప్పు. చాలా విచిత్రంగా ఉంటుంది.

తూర్పు గోదావరి జిల్లాలో అమలాపురం తాలూకా సమీపమున "ముమ్మిడివరం" అనే గ్రామముంది. ఆ గ్రామంలో వెంకమ్మ, సుబ్బయ్య అనే యిద్దరు భార్యా భర్తలు ఉన్నారు. వారికి ఒక కుమారుడు పుట్టేడు. వారు కులమునకు హరిజనులు. తండ్రి కొడుక్కి "సుబ్బారావు" అను పేరు పెట్టేడు. సుబ్బారావుకు చిన్నతనమునుండి చదువు శూన్యము. పాలికాపరిగా ఉంటూ ఉండేవాడు. ఆ బాలుడికి చదువు సంధ్యలు లేకపోయినా చిన్నప్పటినుండీ చాలా వినయంగాను, ఎంతో శాంతిగానూ ఉండేవాడు.

ఇలా ఉంటూ ఉండగా ఒక రోజున ఏమి జరిగిందో తెలుసా బాలా! 22-6-1946 సం॥న ఆ బాలుడు యిల్లగణపతి అను వారి ఇంటి వెనుక తోటలో ఒక పెద్దచెట్టుక్రింద మఠము వేసుకొని కూర్చుండి పోయాడు. తల్లి తండ్రులు వెదకి వెదకి సుబ్బారావుజాడ తెలుసుకొని ఆ చెట్టు వద్దకువచ్చి కొడుకుని కోపగించి యింటికి తీసుకు వెడితే భోజనము చేయకుండా తిరిగివచ్చి ఆ చెట్టుక్రిందే కూర్చుండి పోయాడు. తల్లి తండ్రులు కంగారుపడి ఆ వూరి పెద్దలతో చెప్పితే వారు ఈ కుర్రవాడు మున్ముందు గొప్ప యోగిగా మారతాడని చెప్పేరు.

ఇప్పుడు ఆ యోగిచుట్టూ ఒక గుడి కట్టించేరు. ఇంత చిన్న వయస్సులో మహాజ్ఞాని అయ్యేడంటే వింతగాలేదూ బాలా? విచిత్రం! ఏమీ ఆహారంతినడు. కన్ను తెరవడు. ఎవ్వరితోనూ మాట్లాడడు. గాలిని పీల్చుకొని జీవిస్తూ ఉంటూ ఉన్నాడంటే చాలా విచిత్రంగా ఉందికదూ? ఇతడు బాల్యములో విద్యావిహీనుడు. కాని యిప్పుడు మహాజ్ఞాని. ఈతనిని చూడ్డానికి రోజుకు కొన్ని వేలమంది జనులు వస్తూపోతూఉంటారు. ఆ యోగికి యిపుడు సుమారు 19 సంవత్సరాలుంటాయి.

మొన్న మొన్ననే ఒక మూర్ఖుడు యిదంతా మోసమని, కపటనాటకమని తలచి ఆ బాలుడు ఎంత గొప్ప యోగో చూద్దామని బయలుదేరాడు. ఆ సమయంలో దర్శనము యివ్వటానికి వీలులేదని కొందరు పెద్దలు నిరాకరించేరు. అప్పుడు ఏమి జరిగిందో తెలుసా బాలా! ఆ తెలివిమాలినవాడు ఆ గుడి తలుపుల్ని తెరవడానికని చేతులతో తలుపుని నెట్టేడట. వెంటనే ఆ తలుపులలోంచి ఎలక్ట్రిక్ కరెంటుషాక్ తగిలినట్లుగా తగిలిందట. చూచావా వింత!

రమణ మహర్షి దక్షిణదేశములో పుట్టి చాలా కీర్తి సంపాదించేడు. అరవిందఘోష్ బెంగాల్‌లో పుట్టి గొప్పవాడనిపించుకొన్నాడు. గాంధీ మహాత్ముడు, బుద్ధుడు, క్రీస్తుకూడా ఈ విధముగా చాలా గొప్పవారయ్యారు. వారందరు పెద్దవారు. బాగా చదువుకున్నవారు. కాని బాలయోగి చాలా చిన్నవయస్సులోనే యింత గొప్ప యోగిగా మారాడంటే చిత్రంగాలేదూ!

మీలో ఎవరైనా వచ్చి బాలయోగినిచూస్తే చూడండి. పూర్వం చిన్నపల్లెటూరుగాఉన్న "ముమ్మిడివరం" యిప్పుడు గొప్ప పుణ్యక్షేత్రంగా మారింది. బాలా! తప్పక వెళ్తావుకదూ? బాలా! మా వూరిలో ఒక కవి బాలయోగిని గురించి ఈ క్రింది పద్యము వ్రాసాడు.

నందనాయకుు ఈడైన అందగాడు.
గాంధితాతకు జోడైన గట్టివాడు.
బుద్ధదేవుకు సాటైన పూజ్యుడితడు
బ్రహ్మశక్తిని పరికించు బాలయోగి.

# కష్టపడితేనే సుఖం

రచయిత: కొంతా శివరామకృష్ణ

చంద్రనగరం అనే పట్టణంలో కాంతయ్య అనుపేరుగల ధనవంతుడుకలడు. ఆయనకు సులోచన అను భార్యకలదు. ఆమెకు ముగ్గురు పనికత్తెలుగలరు. ఆ ముగ్గురిలో పెద్దదైన సుబ్బమ్మ యజమానురాలు ఏపని చెప్పినా ఆపని రెండోపనికత్తైన సూరమ్మ మీద పెట్టూండేది. సూరమ్మ సుబ్బమ్మకంటె రెట్టింపు సోమరి. సుబ్బమ్మ తనకు చెప్పిన పనిని సూరమ్మ వెంకమ్మమీద పెట్టూండేది.

వెంకమ్మ చాల మంచిది. కష్టపడితేనే సుఖంఅని వాళ్ళమ్మ చెప్పి చనిపోయింది. తండ్రి మునుపే పోయాడు. వెంకమ్మ ఏపనిచెప్పినా కాదనకుండా చేసేది. సుబ్బమ్మ, వెంకమ్మ, సూరమ్మ, వీరుముగ్గురు సులోచనయింట్లోనే భోంచేసి అక్కడే పడుకుంటూండేవారు. సులోచన పని చెప్పటమేగాని, తను ఎవరితో చెప్పిందో వాళ్ళు చేసారా లేదా అని విచారించదు. అందువల్ల సుబ్బమ్మ, సూరమ్మ ఏపని చేయకపోయిన సులోచనకు తెలిసేదికాదు.

ఒకరోజు ప్రొద్దున వెంకమ్మ లేవగానే, వెంకమ్మ పక్కగా మూడు బంగారునాణెములు పెట్టి ఉన్నాయి. వెంకమ్మ వాటిని చూచి ఆశ్చర్య పోతూండగా సుబ్బమ్మ, సూరమ్మలు అక్కడకు ఏడుస్తూవచ్చారు. వెంకమ్మ వాళ్ళకి ఆ బంగారు నాణెంబులు చూపి మీరెందుకు ఏడుస్తున్నారు అంది. సుబ్బమ్మ ఇట్లా అంది "నేను, సూరమ్మ నిద్రపోతూండగా రాత్రి ఎవరోవచ్చి మమ్మల్ని సూదులతో పొడిచి నిద్రలేకుండా చేసారు. చూడునా ఒంటినిండ" అంది. వెంకమ్మ చాల జాలిపడింది.

వాళ్ళు ముగ్గురు కలసి సులోచనదగ్గరకు వెళ్ళి జరిగినదంతా చెప్పారు. సులోచన కొంచంసేపు

ఆలోచించి ఇట్లాఅంది. "నాచిన్నప్పుడు మాఅన్నయ్య ఒక కథ చెప్తుండేవాడు. ఎవరు కష్టపడి పనిచేస్తారో వారికి బంగారు నాణాలు దొరకుతాయి అని ఎవరు పనిచేయక సోమరిగా ఉంటారో వారిని దేవతలు హింసిస్తారని చెప్పాడు. ఓ సుబ్బమ్మ! ఓ సూరమ్మ! మీరు పనిచేయకుండా ఉన్నారు కాబట్టే మిమ్మల్ని దేవతలు హింసించారు. పనిచేయనివాళ్ళు నాకు వద్దు. పనిచేసే వెంకమ్మలాంటి పనివాళ్ళు కావాలి. మీరు మీ యింటికి వెళ్ళిపోండి. నాదగ్గర పనికత్తెలుగా ఉండొద్దు" అంది. సుబ్బమ్మ, సూరమ్మలు ఏడుస్తు వెళ్ళిపోయారు. బాలా! చూచావా సోమరులైన సుబ్బమ్మ, సూరమ్మల కేమయిందో! బాగా కష్టపడి పనిచేసే వెంకమ్మ గతి ఏమయిందో! చదువు.



వెంకమ్మ తన దగ్గరఉండే మూడుబంగారు నాణాలు తనతో విడవకుండా తీసుకెళ్తు ఉండేది. ఒకరోజు వెంకమ్మ ఏదో పని మీద బజారు వెళ్లింది. బజారులో పాపం ఒక చిన్నపిల్ల వెంకమ్మ దగ్గరకువచ్చి "అమ్మా ఆకలి వేస్తున్నది. ఏమన్నా డబ్బియ్యమ్మా" అంది. వెంకమ్మ జాలితో, కొంచెంకూడ సందేహించకుండ ఒక బంగారునాణెం తీసి పిల్లకిచ్చింది. పిల్ల సంతోషంతో వెళ్లిపోయింది. సులోచన వెంకమ్మతో "వెంకమ్మ నీవు చాల తెలివి తక్కువపిల్లవు. చూడు! బంగారునాణెం ఎవరన్నా యిచ్చుకొంటారా?" అంది. వెంకమ్మ "అమ్మా మీరే

ఆ స్థితిలో ఉన్నారనుకోండి అప్పుడు మీరు నేనిచ్చిన బంగారుఇనాం చూసి మురిసిపోరా'' అంది. సులోచన మాట్లాడకుండా వెళ్లిపోయింది.

మరొకరోజు రాత్రి సులోచన, కాంతయ్య భోంచేసి నిద్రపోతున్నారు. ఆ సమయంలో ఎవరో తలుపు కొట్టారు. వెంకమ్మ తలుపుతీసింది. ఒక ముసలావిడ చలితో వణకిపోతున్నది. వెంకమ్మ ఆమెకు కప్పుకుందుకు ఒక దుప్పటి తెచ్చి యిచ్చి ఒక బంగారు నాణెంకూడ యిచ్చి అవ్వా యిక్కడనుంచి వెళ్లిపో, మా యజమానురాలు మేల్కొంటే కోప్పడుతుంది అనిచెప్పి అవ్వను పంపివేసింది.

ఇంకోరోజు ఒక స్త్రీ ఒక పిల్లని చంకనిపెట్టుకొని సులోచన యింటికివెళ్ళి సులోచనతో "అమ్మా నేనూ ఈపిల్ల భోంచేసి చాలా రోజులయింది. కాస్త అన్నం పెట్టావమ్మా" అని అడిగింది. సులోచన "ఏం? పని చేసుకోరాదూ? ఎద్దులాగా ఉన్నావు. వెళ్ళు వెళ్ళు" అంది. పాపం ఆ స్త్రీ నిరాశతో వెళ్ళిపోతూండగా వెంకమ్మ పరుగు పరుగునవచ్చి మిగిలివున్న బంగారు నాణెంయిచ్చి "దీంతో నీపిల్ల, నీవు కడుపు నిండించుకోండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి వెంకమ్మ పడుకోపోతుండగా, వెంకమ్మకళ్ళ జిగేలు మన్నట్లు ముగ్గురు దేవతలువచ్చి నిలబడ్డారు. అందులో ఒక దేవత "ఓ వెంకమ్మా! నీవు ఆ రోజు బజారులో ఒక పిల్లకు ఒక బంగారు నాణెం ఇచ్చేవు కదూ! ఆ పిల్లను నేనే. నీ పరోపకారమునకు సంతోషించి నీవు ఏ వరం కోరుకుంటే ఆ వరం ఇస్తాను" అన్నది. వెంకమ్మ "ఓ దేవతా! నాకు ఒక మంచి యిల్లు, ఆ యింట్లో సకల సదుపాయాలు ఉండేటట్లు చెయ్యి" అంది. దేవత సరేనని మాయమైంది. రెండో దేవతవచ్చి "వెంకమ్మా నీవు ఒక బంగారు నాణెం యిచ్చిన ముసలాయన నేను. నీకు ఏ వరం కావాలో కోరుకో" అంది. వెంకమ్మ "నేను పొయ్యిమీద ఉట్టి కుండలు పెట్టంగానే పంచభక్ష్య

పరవాన్నాలు ప్రతిరోజు తయారు కావాలి'' అంది. సరేనని దేవత మాయమైంది. మూడో దేవత వచ్చి "వెంకమ్మా నీవు సహాయం చేసిన స్త్రీని నేనే. నీవు ఏమైనా వరం కోరుకో'' అంది. వెంకమ్మ "నేను ప్రొద్దున్నే లేవగానే ప్రతి రోజు మూడు బంగారునాణెములు నా పక్కలో ఉండాలి. పరోపకారబుద్ధి నాకు ఉండాలి'' అని కోరింది. దేవత సరేనని మాయమైంది.

బాలా! ఇట్లు దేవతలవలన వరాలుపొంది వెంకమ్మ, సులోచనవద్ద పనికత్తెగా ఉండుట మాని తన సొంత యింట్లో సుఖంగా ఉంటూ ఉంది.

బాలల్లారా! ఎప్పుడూ కష్టపడితేనే సుఖం. వెంకమ్మ కష్టపడి యిప్పుడు సకల భోగాలను అనుభవిస్తుంది.





# ప్రాప్తమెంతో అంతో

సంపాదన: శ్రీరామదాసు వెంకటయ్య (సీతారామపేట)

అనగనగా ఒక పల్లె. పల్లెలో ఒక్కటే బ్రాహ్మణిల్లు. ఇంటియజమాని పేరేమోగాని చిన్నా పెద్దా అందరూ పంతులయ్యంటారు. ఎప్పుడూ పదిమంది పిల్లలకు చదువు చెప్పుకొని జీవనం చేస్తుంటాడు. బహు పిసినారి. కూరలు మొదలు నెయ్యిగాకా బడిపిల్లల్ని తెమ్మని వేధిస్తాడు.

పంతులుగారికి రెండో పెళ్లి. భార్యపేరు బంగారమ్మ. చిన్నతనంనుండి చిరుతిళ్లు బాగా అలవాటుపడింది. కాపరానికి వచ్చింది మొదలు 'ఇదో' నని చెయ్యిచాచి ఒక్క దమ్మిడీ యిచ్చిన పాపాన పోలేదు పంతులు. బంగారమ్మకు చిరుతిళ్లపై ఆశ చావలేదు. రహస్యంగా ఏదేనా చేసుకుందామా అంటే గడప దాటి కదలడు పంతులుగారు. ఇంట్లోనే బడి. అందులోనూ చూచిరమ్మంటే కాల్చి వచ్చే పిల్లకాయలు. అమ్మ యేంజేసినా అయ్యతో, అయ్యయేంజేసినా అమ్మతో యెప్పుడు తంటాలు చెపుతూంటారు.

ఆనాడు దసరా పండగ. బాలలు కొత్తకొత్త అలంకారాలతో హాజరయారు. బాలల పుష్పబాణాల మజా చూపించేందుకు దసరా పద్యాలు చెప్పిస్తూ ఊరిలో సంభావనకు విధిలేక బయలుదేరవలసి వచ్చింది పంతులుగారు. బాలలెవ్వరు యింటివద్దలేరు. బంగారమ్మ నోము పండింది, వీధిలో పప్పులూ బెల్లంఅమ్మేవాడిని పిలిచింది. పప్పులు బెల్లం కొనింది. దంచేందుకు పప్పులు ఱోట్లోపోసింది. ఇంతలో "అమ్మా" అంటూ ఒక పరదేశి యింట్లోకి వచ్చాడు. పనితొందరలో ఆ పరదేశి నీళ్లు అడిగిందే మఱచిపోయింది బంగారమ్మ. ఇంకా యిస్తుందేమోననే ఆశతో ఆ అడుగుపంచనే తిష్ఠ




వేశాడు పరదేశి. బెల్లంకూడా వేశింది. కొద్ది పక్వంలో దంచుతూఉంది యేకదీక్షతో బంగారమ్మ.

ఏపనిపైనో సమయానికే గబగబా పంతులుగారు యింట్లో దూరారు. ,ఱోటిలో పదార్థం చూచేసరికి అరికాలిమంట నెత్తికెక్కింది. ''అస్ ! నీ తస్సాగొయ్యా! నన్నే ఏమారుద్దామని చూచావా? చూడు నా తడాఖా అని కర్ర పుచ్చుకొన్నాడు పంతులయ్యా. కర్రను చూడ్డంతోనే బంగారమ్మ బుర్రలో ఆలోచనలు తళుక్కుమని మెఱిసాయి. ''అయ్యోరామా! మనవికాదండీ! ·పాపమాపరదేశి ఆకలితో దంచిపెట్టు తల్లీ! అని కాళ్లావ్రేళ్లా బతిమలాడితే సరేనన్నాను'' అని బంగారమ్మ భయంతో బొంకింది.

ఈ సంగతి అంతా వింటున్న పరదేశి ఒక్క క్షణంలో అంతా కనిపెట్టేశాడు. వెంటనే బిగ్గరగా: '‘పంతులుగారూ! నిజమేనండీ! ఆఱోటిలో పదార్థము నేనే దంచమన్నాను. దయచేసి ఆ పిండి వంట నాకిప్పించి పుణ్యం కట్టుకోండి'' అంటూ అన్నాడు.

నిజమే అనుకొని శాంతించాడు పంతులయ్యా. ఱోటిలో వున్న పదార్థం ముద్దచేసి బంగారమ్మ ఆ పరదేశి కొంగులో పోసింది. ''ఇక శెలవా! బంగారమ్మతల్లీ!'' అంటూ వాకిలి దాటాడు పరదేశి.

ప్రాప్తమెంతో అంతే అని గొణుగుకుంటూ పెరట్లోకి వెళ్లింది బంగారమ్మ. పంతులు బయటికెళ్లాడు, కథ బాలకి వెళ్లింది.

# చిన్నతనంలో

రచన : పి. వి. రత్నం, విజయనగరం.

పూర్వము "బాబరు" యనే మహమ్మదీయరాజు మన దేశంలో వుండే వాడు. అతనికి ఒకనాడు "చిన్నప్పటినుంచీ ఎలా నడిపితే పిల్లలు అలాగే పెరుగుతారా? లేక మఱొక విధంగా నడుచుకుంటారా?" యని మంత్రితో ఆలోచించి ప్రత్యక్షంగా ఈ విషయం తాను చూస్తే గాని నమ్మనన్నాడు. తర్వాత ఏం చేశాడో తెలుసా ?

ముగ్గురు పిల్లలను పుట్టిన వెంటనే ఒక జైలులో పెట్టి బంధించివేశాడు. ఉగ్గు, పాలు పోసేటప్పుడు ఏమీ ఎవ్వరినీ మాట్లాడ నివ్వలేదు, ఆ పిల్లల దగ్గర ఏమీ చేయరాదు, చూద్దాం ఏం జరుగుతుందో ? రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచి పోయాయి. ఆ ముగ్గురూ ఎలా వున్నారు ? అన్నంతినరు మంచి నీళ్లు త్రాగడం ఎలాగో తెలియదు. బట్టలు కట్టుకొనడం చేతనవలేదు. మాట్లాడం పూర్తిగా రాదు "అమ్మ" "మామ" యని కాని 'నాన్న' "అక్క" యని గాని ఏమీ మాట్లాడలేక పోయారు. వట్టి వెఱ్ఱిబాగులవలె తయారయ్యారు.

అప్పుడు ఈ వింతను రాజు, మంత్రి మొదలగు వారందఱు చూసి ఎంతో ఆశ్చర్యపడ్డారు.

అందుకే చిన్నప్పటినుంచీ ఎలా మంచి బుద్ధులతో వుంటే అలా మంచివారవుతారు. చెడ్డతలంపులతో చెడ్డవారవుతారు. చిన్నప్పుడు భయంతో వుంటే పెద్ద ఎదిగిన తర్వాత అది పోదు. ఇదంతా తల్లిదండ్రుల్లో వుంటుంది.



# కోతులసేన

రచన: మహాధర నళినీ మోహన్‌రావు (కాకినాడ)

ఏమర్రోయ్! పిల్లకాయలూ!

ఏ కొంటి కోణంగి ఐనా అల్లరి చేస్తూంటే "కోతిలా అల్లా అల్లరి చేస్తావేమిట్రా?" అని పెద్ద లంటూఉంటారు ఎప్పుడైనా విన్నారా? నిజానికి కోతులు అల్లరి చెయ్యడమే కాదు. అవి మనుష్యులకు ఎంత ఉపకారం చేస్తాయో, అవి యెంత తెలివైనవో ఈ కథ చదవండి తెలుస్తుంది.

ఇప్పటికి 600 సంవత్సరాల క్రితం ఉత్తర హిందూదేశంలో "అవంతి" అనే రాజ్యం ఉండేది. ఆ రాజ్యాన్ని "వీరేంద్రసింహుడు" అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆ రాజు చాలా బలవంతుడు. ధైర్యమైనవాడు. ప్రజలని చక్కగా పాలించేవాడు. ఆ రాజుకి "సర్వజ్ఞుడు" అనే మాంచి తెలివైన మంత్రి ఉండేవాడు. ఆ మంత్రి చాణక్యుడు, తిమ్మరుసులకంటె తెలివైనవాడంటే నమ్మండి!

ఆ అవంతీ రాజ్యానికే దగ్గరలో "మగధ" అనే మరో రాజ్యం ఉండేది. ఆ దేశపు రాజు ఆ చుట్టుపక్కల రాజులందరికంటేనూ బలవంతుడు. పెద్ద సైన్యం ఉంది. 10 వేల గుర్రపు దళంకూడా ఉంది. కాని వీరేంద్రసింహుడికి 6 వేల గుర్రపు దళంమాత్రమే ఉంది. అందుచేత ఆ మగధరాజు తనమీదకి దండెత్తివస్తాడేమో అని బెదురు కలిగింది వీరేంద్రుడికి. అప్పుడు వీరేంద్రుడు వెంటనే మంత్రిని పిలిపించి సంగతంతా చెప్పేడు. ఆ సర్వజ్ఞుడు "ఈమాత్రానికి ఇంత విచారం దేనికి ప్రభూ! ఆ రాజుని ఓడించే పూచీ నాది" అని రాజుకి ధైర్యం చెప్పి, తన ఇంటికి వెళ్లి ఆ రాత్రంతా ఏమిటా ఉపాయం? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. అల్లా ఆలోచించగా ఆలోచించగా చటుక్కుని మెఱుపులాంటి ఊహ ఒకటి తోచింది సర్వజ్ఞుడికి.

"ఆc...ఇంక ఆ మగధ రాజుని నిమిషాలమీద ఓడించవచ్చు" అనుకుని ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు.

ఆ అవంతీ రాజ్యానికి తూర్పుగా 3 మైళ్ల దూరంలో ఒక చిట్టడవి ఉంది. ఆ చిట్టడవిలో వేలకొలది కోతులు ఒక చెట్టుమీదనుంచి ఇంకో చెట్టుమీదకు దూకుతూ, ఆ చెట్ల పళ్లుకోసుకు తింటూ, కిచకిచమని అరుస్తూ, తమ పిల్లల్ని పొట్టకి పట్టించుకుని గంతులేస్తూ ఉండేవి. అందుచేతనే ఆ చిట్టడవికి "కోతుల తోపు" అని పేరువచ్చింది.

ఆ మర్నాడు సర్వజ్ఞుడు "కోతుల్ని పట్టుకొతెచ్చినవారికి కోతి ఒకటికి రూపాయి చొప్పున బహుమానం ఇవ్వబడుతుందోహోయ్" అని అవంతీ నగరం అంతా చాటింపు వేయించేడు. అప్పటినుంచీ వందలకొలదీ కోతులు కోటలోకి వచ్చి పడుతున్నాయి. ఇల్లా పదిరోజులయ్యేటప్పటికి 6 వేల కోతుల్ని పట్టుకొన్నారు. ఇంక సర్వజ్ఞుడేంచేసేడంటే ఒక్కొక్క సిపాయికి ఒక్కొక్క కోతి, ఒక గుర్రంచొప్పున ఇప్పించేడు. రోజూ ఆ కోతుల్ని బాగా మేపడం. తరవాత వాటిని బలవంతంగా గుర్రంమీద ముందు కూర్చోపెట్టుకుని, వెనకాల ఆ సిపాయిలు కూర్చుని స్వారీ చెయ్యడం. ఇల్లాగ ప్రతిరోజూ చేసేవారు. మొట్టమొదట్లో ఆ కోతులు సిపాయిలని రక్కి, పీకి, కరిచి, అరిచి నానా గోలా పెట్టేవి. పది పదిహేనురోజులయేటప్పటికి వాటికి బాగా అలవాటైంది. వాటంతట అవే గుర్రంమీద ఎగిరి కూర్చోడం, గుర్రం రెండు చెవులూ పుచ్చుకుని చెల్ చెల్ మని తోలి స్వారీ చెయ్యడం నేర్చుకున్నాయి. ఇంక చూసుకోండి! ఆరోజు మొదలుకొని ఎక్కడ గుర్రం కనిపించినా సరే, దాని నడ్డిమీదకి ఎగిరి సరిగ్గా వీరేంద్రుడి గుర్రపుసాలలోకి తీసుకువచ్చేసేవి. ఈ కోతుల్ని పట్టుకోడం, పెంచడం, స్వారీ నేర్పడం అదీచూసి "ఈ మంత్రిగారికి మతి పోయిందా యేమిటి చెప్మా?" అనుకునేవారు ప్రజలందరూ.

ఇల్లా ఒక నెలరోజులు గడిచేటప్పటికి వీరేంద్రసింహుడుఅనుకున్నట్లే ఒక రాత్రివేళ మగధ రాజు తన 10 వేల గుఱ్ఱపు దళంతోటే వచ్చి పడ్డాడు. ఆ మగధ సైన్యాలన్నీకూడా ఆ కోతుల తోపులోనే విడిసేయి తెల్లవారగానే హఠాత్తుగా కోటను పట్టుకుందామని. ఇంతకుముందే శత్రువులు వస్తున్నారని తెలిసి ఆ ఆరు వేల కోతుల్నీ కోతులతోపులో చెట్లమీద వదిలిపెట్టించేశాడు సర్వజ్ఞుడు. పాపం! ఆ చీకట్లో చెట్లమీద కోతులున్నట్లే చూడలేదు మగధ సైనికులు. అందరూ తమ గుఱ్ఱాలని అక్కడ చెట్లకి కట్టేసి, గుడారాలు వేసుకుని, సైనికులందరూ పడుకున్నారు.

తెల్లవారింది. కొంచెంకొంచెం వెలుగువస్తోంది. అప్పుడు మగధ సేనలన్నీ లేచేయి. బాణాలూ అవీ సద్దుకుంటున్నారు యుద్ధం కోసం. ఇంతట్లోకే గబగబా చెట్లమీదనుంచి ఆ గుఱ్ఱాలనడ్డి మీదకి దూకేసేయి కోతులన్నీ!



మీ జబ్బులకు కారణము —
మురికే!

మురుగు కాల్వలు,
మురికి గుంటలు,
మురికి బట్టలు,
విషక్రిములకు నిలయము.

ఇదే మీ జబ్బులకు,
జ్వరములకు,
జలుబులకు,
ఆధారము.
మురుగును చంపే మందు

డిసిన్ఫెక్ ఫ్లైల్

శ్రేష్ఠమైన ఫినయిలు

ప్రతి ఇంట ఉండదగిన మందు.

శ్రీవత్స కెమికల్సు

డ్రగ్సు లిమిటెడ్,

(మందులను తయారుచేయుసంస్థ)

72, గోవిందప్పనాయక వీధి,

మదరాసు 1.

# బాలమహిమ

మహేశ్వర్

అల్లరి పాపాయ్ తప్పులు కొడితే
కొల్లలుగా జడి వానలు కురిసేయ్
ఆవకాయలూ పాడౌతాయని
అమ్మమ్మెంతో అఘోరించిందీ;

పిడుగు లాగ ఎండా వస్తే
పిడకంత రొట్టె కాలుస్తానని
సూర్య దేవుడికి మొక్కుకున్నాదీ!

తా....త్త....తా....త్త....అ అ త్తా
అని అల్లరి పాపాయ్ ఊసులాడితె
అమ్మ జుట్టు ఇట్టే ఊడిందీ!

నాన్నా నాన్నా అంటూ పాపాయ్
నాజూకుగా పాకిరి నప్పుడు
అమ్మా అమ్మా అంటూ పాపాయ్
తప్పటడుగులు వేస్తూన్నప్పుడు
ఇల్లంతాను సందడి నిండగ
ఇరుగు పొరుగులూ ఓ హో హో యని
ఇంతో, అంతో, ముద్దులాడగా
పాపాయ్ కెంతో దిష్టి తగలగా
దిగులు దిగులుగా దిక్కులు చూడగ
దిష్టి మంత్రం వేదామా వసంతం దిగదుడుద్దామా?

## చెవులోమాట !



రచన: "లలితాదేవి" (పిప్పర)

వెలువడింది : ప్రతి రు. 1-0-0

### నవ్వించే నాటకం

# "సినిమా జ్వరం"

రచయిత :

**"మహేశ్వర్"**

చక్కని ఆకృతిలో వెలువడిన ఈ హాస్య వ్యంగ్య నాటక గ్రంథానికి ఏజెంట్లు కావలెను.

25% కమీషన్.

శ్రీ నటరాజ నాట్యమండలి,

బరంపురం (గంజాం)

### "బొమ్మరిల్లు"

ముద్దులు మూటకట్టే సైజులో వెలువడ్డ పిల్లల కథల పుస్తకం.

ప్రతి 0-4-0

పై యడ్రసుకి రాయండి.

## బుర్రకథలు

(ప్రయాగ నరసింహశాస్త్రి రచన)

1. "స్వాతంత్ర్య భారతి" 0-2-0
2. "బాపూజీ" 0-2-0
3. "నేతాజీ" 0-6-0

వలయువారు :

ప్రయాగ నరసింహశాస్త్రి

4, మునియప్ప పిళ్లె వీధి

మదరాసు 2

## అంటింపబడ్డం



తండ్రి: అబ్బాయ్ ! కవరు అంటించావా ?

కొడుకు: అంటించానాన్నా ! అగ్గిపెట్టె దొరక్కపోతే బొగ్గుల పొయ్యిలో అంటించా !

సంపాదన: "మీరాం"



బాలకు లారా
బాలిక లారా
బడి గంటదిగో
మ్రోగిందీ....

పదండి బడికీ
పదండి త్వరగా
పంతులు కన్నా
ముందే పోదాం॥బా॥

పంతులురాగా
పలకలు పట్టీ
పాటలు పాడీ
ప్రార్ధన చేదాం....॥బా॥

అ....ఆ....ఇ....ఈ
ఆడుచు దిద్దీ
ప....పా....బ....బా...
పాడుచు వ్రాద్దాం....॥బా॥

అమ్మా..నాన్నా....
అక్కా..బావా....
అందరి వలెనే
చదివేద్దాం....॥బా॥

లందరం
బాగుగ చదివీ
బియ్యే యెమ్మే
ప్యాసవు దా...ం...॥బా॥

# దసరా ఉత్సవాలు

బాలలారా!

మదరాసు ఆంధ్రబాలానంద సంఘమువారు ఈ యేడుకూడా దసరా ఉత్సవాలు జరుపుతారు.

ఆ రోజుల్లో పిల్లల నాటకాలూ, వినోదాలూ, నృత్యాలూ, పాటలు, పోటీలు జరుగుతాయి.

ఈ దిగువ పోటీలలో బాలలందరూ పాల్గొన వచ్చును.

## 1. వ్యాసరచన పోటీ

విషయం : పిల్లలు తమ ఇంటికి ఎట్లు సహాయపడగలరు?

రెండు అరతావులకు మించకుండా చక్కని దస్తూరితో వ్యాసం పంపాలి.

## 2. చిత్రలేఖన పోటీ

విషయం : "రైలుబండిబొమ్మ" పెద్దవారి సహాయం లేకుండా బొమ్మరాసి పంపాలి. (ఈపై పోటీలలో పైవూరు బాలలు కూడా పాల్గొనవచ్చును.)

## ఇంకా

దసరా రోజుల్లో నాటికలపోటీ, హాస్యవేషాలపోటీ, పాటల పోటీ మొదలైనవి వుంటాయి.

పోటీలకు గెలచినవారికి దసరా బహుమతులుంటాయి.

పోటీలకు ప్రవేశరుసుములేదు.

వ్యాసములు, బొమ్మలు మాకు 18 తేదీ లోపుగా చేరాలి.

ఇతర పోటీలలో పాల్గొన దలచినవారు, వారిపేర్లు ఎడ్రసుతోసహా ఈ నెల 20 తేదీ లోపుగా తెలుపవలెను.

ఇతర వివరములకు :

ఆంధ్ర బాలానంద సంఘము "బాల" ఆఫీసు
170, రాయపేట హైరోడ్డు, మదరాసు 14 అని రాయండి.

దసరా ఉత్సవములు

# ధనికులకు మనవి

ధనికులారా!

మదరాసులోని తెలుగుబాలల దసరా ఉత్సవములు జయప్రదముగా జరగాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు ఎవరిస్తారు? ధనికులయిన మీరు. మదరాసు తెలుగు బాలల అభివృద్ధికొరకు మీరు మా బాలానంద సంఘమునకు విరాళములు ఇయ్య ప్రార్థన. మీరుపంపిన విరాళములు "బాల" లో కృతజ్ఞతతో స్వీకరింతుము,

న్యా॥ కామేశ్వరి,
న్యా॥ రాఘవరావు
"బాల" ఆఫీసు

---


## పండుగరోజులు: పిండివంటలు

భాద్రపద మాసంలోనూ, ఆశ్వీయుజ మాసంలోనూ కలిపి చాలా పండుగలు వస్తాయి. ప్రతియింటాపిండివంటలు చేసుకుంటారు. తిండి ఎక్కువైనప్పుడు అజీర్ణంతప్పదు. కాని, పిండి వంటలలో మంచియింగువను ఉపయోగిస్తే, అజీర్ణపుబాధే వుండదు.

మంచిఇంగువ కావాలంటే, 'తిలక్ మార్కు' ఇంగువ.

తిలక్ మార్కు ఇంగువ అన్నిషాపులలోనూ దొరుకుతుంది.

లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

### గోపాల్‌జీ చాంపషీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, జి. టి, మదరాసు-1.

# ప్రశ్నలూ — జవాబులూ

ప్ర:- "బాల"లో కథలకు డబ్బు కట్టాలా?

—సౌ॥ సీత (విజయనగరం)

జ:- అక్కరలేదు.

ప్ర:- రేడియో వార్తలు ఢిల్లీ నుండి ఎందుకు చెప్తారు?

—బి. యల్. మధుసూధన్ (విజయవాడ)

జ:- అన్ని భాషలలో వార్తలు ఒకే కేంద్రంనుండి చేస్తే వాళ్లకి సదుపాయం. ముఖ్యంగా అంచేత.

ప్ర:- "బాల" అట్ట వెనుక రిజిస్టరు నెం. వుంది. అది ఎందుకు?

—పి. యస్. నారాయణ (బొబ్బిలి)

జ:- తపాలావారు "బాల"కు ఆ నెంబరు ఇచ్చారు. ఆ నెంబరు వేస్తే పోస్టు ఛార్జి తగుతుంది. "బాల" 1 కాని బిళ్లకే మీకు అందుతుంది.

ప్ర:- తలకు నీళ్లు పోసుకోగానే సాంబ్రాణి పొగ వేస్తారు. ఎందుకు?

—వి. వీరభద్రం (కాళమనాయుడుపేట)

జ:- తలనువున్న తడి వేగంగా ఆరిపోడానికిన్నీ, విషక్రిములు పోవడానికిన్నీ.

ప్ర:- నేను ఎప్పుడూ బాలుడిగనే వుండాలనివుంది. అది వీలవుతుందా?

—కె. నీలకంఠరావు (ఆదవాని)

జ:- వయసు ముదిరినా, మనస్సు బాలల మనస్సుగా-అంటే కుట్ర, కల్మషం లేకుండావుంటే చాలు.

ప్ర:- చాలామంది బాలలకు లెక్కల క్లాసు, ఇంగ్లీషు గ్రామరు క్లాసు అంటే తలనొప్పి. ఎందులకు?

—జి. అనంతకృష్ణుడు (మదరాసు)

జ:- (1) మీ మేష్టార్లు మీకు తేలికగా, ఆయా విషయాలలో సరదా కలిగేటట్లు చెప్పరుగనుక. (2) మీరు ఆ రెండూ ఎంతో కష్టం అనుకొని క్లాసులో వాటి మీద శ్రద్ధ చూపరుగనుక.

ప్ర:- రేడియో అన్నయ్య, బాలన్నయ్య ఒకరేనా?

—మారెళ్ల సత్యగావేశ్వరి (కాకినాడ)

జ:- ఆ రహస్యం చెప్పకూడదు. చూడవలసిందే!

ప్ర:- సినీమాలు, నాటకములు, బొమ్మలాటలు, భాగవతములు, బుర్రకథలు—వీటిని

చూస్తే తెలివినిచ్చేవి ఏవి ? వేటిని చూడకూడదు.

—యం. సి. హెచ్. వెంకట రమణ (తాళ్లపాలెం)

జ:- అన్నీ చూడొచ్చు. వాటిలోని మంచి తీసుకొని చెడ్డను వదలడం మనలో వుంది.

ప్ర:- మేము పంపే బొమ్మలు దేనితో వేయాలి ?

—ఆర్. రాధాకృష్ణ (రాజమండ్రి)

జ:- ఇండియన్ ఇంక్ అని నల్లని సిరాతో వేస్తే బ్లాకులు బాగా వస్తాయి.

ప్ర:- మనం రాముడు, గోపాలుడు, సీత, సావిత్రి అని దేముళ్ల పేర్లు పెట్టుకుంటాం గాని రావణాసురుడు, హిడింబి అని ఎందుకు పెట్టుకోము ?

—కలగ సుబ్రహ్మణ్యశాస్త్రి (పాట్నా)

జ:- మనం ఎప్పుడూ మంచిని కోరుతాం గనుక. చెడ్డగా తిట్టేటప్పుడు రాక్షసుల పేర్లు ఉపయోగిస్తాం. అంతే భేదం.

ప్ర:- మనకి స్వతంత్రం వచ్చినా, బీదలు ఇంకా అడుక్కుంటున్నారేం ?

—సుంకర హరినాధ కృష్ణారావు (నందిగామ)

జ:- పాపం, ఇంకా వారికి స్వాతంత్ర్యం రాలేదన్నమాట.

ప్ర:- "బాల" ఆఫీసు చూడాలని ఉంది. రానిస్తారా ?

—బి. యర్రంశెట్టి (బంగారయ్యపేట)

జ:- ఓ. తప్పకుండా !

ప్ర:- విద్యార్థుల విజయము దేనిపై ఆధారపడి యున్నది.

—ఆత్మూరి సీతయ్య (నర్సాపురం)

జ:- కేవలం విద్యార్థుల శ్రద్ధ, పట్టుదలపై ఆధారపడివుంది.

ప్ర:- బాల "వినోద పజిల్" ఆపు చేశారేమి ?

—జయంతి జయచంద్ర (విజయనగరం)

జ:- క్రొత్త పజిల్ ఏర్పాట్లు ఇంకా పూర్తికాలేదుగనుక.



పిల్లల ఆరోగ్యమే పెద్దల కానందం. 2 చుక్కల పర్గాల్ను కొంచెం కాఫీ, లేక తల్లిపాలలో వేసి త్రాగించిన సుఖవిరేచనమై ప్రేవులు శుభ్రమై పిల్లలు సుఖించుటేగాక తలిదండ్రులను ఆనందపెట్టును. పెద్దలును వాడవచ్చును. సుఖవిరేచనమునకు సాటిలేనిది. సీసా రు 1. (పోస్టేజి ప్రత్యేకం)

కౌండిన్య డిపో
కృష్ణాపురం, అక్బరాబాద్, మదరాసు.

**పిల్లలు** మనం అనుకున్నదానికంటే త్వరగా పెరుగుతారు. ఆ పెరుగుదలతో పాటు వారి అవసరములుకూడా ఎక్కువ అవుతాయి. వారికి వారి జీవితములో అన్ని సదుపాయములు చేసి, వారియొక్క భావినిగురించి ఆలోచించవలసిన బాధ్యత వారి తలిదండ్రులైన మీపై ఉంది.

కొన్ని సమయములలో వివాహమునకుగాని లేక పెద్ద చదువులు చదివించుటకుగాని ఎక్కువ సొమ్ము అవసరము కలిగినప్పుడు ఇబ్బందికలుగును. అట్టి సమయములలో మా తాలూకు సాటీనా విద్యా సహాయక భీమాగాని, వివాహ ఎండోమెంటు భీమాగాని మీకు సహాయపడును.

వివరములకు :

సిటీ బ్రాంచి మేనేజరు:

# యునైటెడ్ ఇండియా
# లైఫ్ ఎష్యూరెన్సు కంపెనీ లిమిటెడ్.

పోష్టుబాక్సు నెం. 281, మద్రాసు అని వ్రాయండి.

---

# వానకాలం: దోమలు

శ్రావణ, భాద్రపదాలు వానకాలం. దోమలు విస్తారంగా వుంటాయి. ప్రతి యింటిలోనూ కర్పూరధూపం వెలిగించడం, పడుకునే పక్కలమీద మంచికర్పూరం పొడిచేసి చల్లడంచేస్తే, దోమలబాధవుండదు.

మంచికర్పూరం కావాలంటే 'గడియారం మార్కు' కర్పూరం కొనండి.

గడియారంమార్కు కర్పూరం అన్నిషాపులలోను దొరుకుతుంది. లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాయండి.

# గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, జి.|టి.| మదరాసు, 1.

# బాలసంఘాలు

**శహాడోల్ అజాద్ బాలసంఘం:**

ఆగస్టు 6 వ తేదీని సభలో "హిందూ దేశయ కామన్వెల్తుతో ఉండుట మంచిదా, కాదా?" అనే విషయంగురించి శ్రీ హైమవతి, శర్మగార్లు బాగా మాట్లాడేరు. ఉంటేనే మంచిదని తీర్మానించారు.

## అయ్యన్నపేట

## శారదా బాలసంఘం

ఈ విద్యార్థి సంఘ వార్షికోత్సవం ఆగస్టు 16 తేదీని జరిగింది. శ్రీ గ్రామ మునసబుగారు అధ్యక్షులుగ పగలునుండి రాత్రివరకు అల్పాహారములు, సభలు, హరికథలతో కార్యక్రమం జయప్రదముగా జరుపబడింది.

**నందలూరు ఆంధ్ర బాలసంఘము:**

ఈ సంఘమువారు ఒక లైబ్రరీ, ఆటస్థలము మొదలయినవి స్థాపించనున్నారు. మంచి సలహాలను కోరుచున్నారు.

**గుడివాడ యువజన బాలసంఘం:**

తొమ్మిది మెంబర్లతో శ్రీ జోశ్యుల వెంకటకనకలింగేశ్వరరావుగారి అధ్యక్షతను ఈ సంఘం క్రొత్తగా పెట్టబడింది.

## రావికమతం

## బాలసారస్వత సమితి:

ఆగస్టు 15 తేదీని స్వాతంత్ర దినోత్సవం జరుపబడింది. జాతీయ అభినయ గీతములు, పోటీ పరీక్షలు, జరుపబడి బహుమతులు, మిఠాయి పంచిపెట్టబడెను. దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు చనిపోయినందున, 18 తేదీని సంతాప సభ జరుపబడింది.

**యర్రగుంట్ల బాలసంఘం:**

- ఈ బాపూజీ బాలసంఘం, శ్రీ మిస్. మాణిక్యమ్మగారి అధ్యక్షతను, బాపూజీ పటం పాఠశాలలో పెట్టించారు. జిల్లా బోర్డు బాల బాలికా పాఠశాలలు కలిపేదామని నిర్ణయించినందులకు అసమ్మతిని తెలియజేశారు.

## కొమరవోలు

## గ్రామ విద్యార్థి సంఘం

పోయిన మార్చిలో పెట్టబడిన ఈ సంఘం దినదినాభివృద్ధి పొరుగుతోంది. పోటీలు జరుపబడుతున్నాయి. "ఆజాద్" అనే వ్రాత పత్రికను ప్రచురిస్తున్నారు.

**అల్లిపురం బాలసంఘం:**

సుభాస్‌బోస్ బాలసంఘంవారు గణపతి నవరాత్రులు చేస్తున్నారు. "బాల"లో ప్రచురింపబడిన "తెలివిగల బాల" నాటికను ప్రదర్శించారు.

భోగాపురం ఆంధ్ర గౌరీ బాల సంఘమువారు: స్వాతంత్ర్యదినోత్సవం జరిపారు.

శ్రీ నేతాజీ బాల విద్యార్థి సారస్వత సంఘం అనే పేరిట, పరిగిలో క్రొత్తగా ఒక సంఘం పెట్టబడింది. శ్రీ డి. ఆర్. శ్రీనివాసరావుగారు అధ్యక్షులుగావుండి ఎంతో ఉత్సాహముతో ఈసంఘమునకు సహాయము చేయుచున్నారు.

**దిగుమతి** ప్రస్తుతము మరల వయిటాయిల్సు సీమరంగులు శింథటిక్ యశ్సెన్సులు సీమనుంచి విరివిగా దిగుమతి అవుచున్నవి. వీటితో అతిసులభముగా కంటికింపగు రంగులు, శింథటిక్ యశ్సెన్సులతో వయిటాయిల్ పైన హేరాయిల్సు తయారుచేసి మార్కెట్టులలో చౌకధరలకు విక్రయించుచున్నారు. యివి శిరోజములకు హానికలిగించుటయేగాక క్రమముగా కంటిచూపునుకూడా పాడుచేయును. గాన ఈ తళుకు మెళుకు తల నూనెలను చూచి మోసపోయి కొనిఉపయోగించవద్దు. శాస్త్రీయముగా ఆయుర్వేద పద్ధతులపై ఓషధులు, అమ్లములు మరియు దేశీయ అత్తరువులనుచేర్చి సక్రమముగా తయారైన అశోకా అమ్లా హేర్ ఆయిల్ ను ఉపయోగింపుడు. ఇది శిరోజములను పోషించుటయేగాక మెదడునకు కన్నులకు చల్లదనము నిచ్చును. మరియు మనోహరమగు దీని పరిమళము మిమ్మానంద భరితులను చేయును.

ఉత్తమమగు దేశీయ అత్తరువులు యిందు చేరియున్నవిగాన శిరోజములయందు దీని పరిమళము చాలాకాలము నిలచియుండును. సుప్రసిద్ధమైన ఈ హేరాయిల్ నకు అనేక నకలు అమ్లాహేరాయిల్సు బయలుదేరినవిగాన కొనువారు మా అశోకామార్కు గమనించి కొనవలయును. యియ్యది-ఓషధుచే తయారుచేయబడలేదనిగాని - యిందు వయిటాయిల్ లేక మినరల్ ఆయిల్సు చేరినట్లుగాని రుజువు చేయువారలు 500 రూపాయలు బహుమతి పొందగలరు.

తయారుచేయువారు : విజయా కెమికల్సు

15, క్లిమెన్సు రోడ్డు, పురశవాకం - మదరాసు.

---

---

**బాలసుధ**

బాలురకు ఇది నిజముగ అమృతము వంటిదే. ఇది పొందుచున్న యోగ్యతాపత్రములనుబట్టియే దీనియొక్క ప్రభావము వెల్లడి అగుచున్నది. బాలురకుకలుగు అజీర్ణము, దగ్గు, విరేచనములు, బలహీనతమొదలగు అనేక లక్షణములకు అమోఘముగ పని చేయును. బాలురు చక్కని ఆరోగ్యస్థితిలోను పుష్టివంతులుగను ఉండునట్లుగ చేయును. ఒకరూపాయిని మాత్రమే ఖర్చుచేసినచో ఒక నెలకు సరిపోవు 50 - మాత్రలనుపొంది అసదృశములగు అనేక గుణములను పొందగలరు.

డాక్టర్, శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి. అండ్ సన్సు, రాజమండ్రి.

## బాలానందం

### సెప్టెంబరు

**శనివారం 3-వ తేదీ**

రారండోయ్ (పిలుపుపాట); అక్కయ్య కబుర్లు; ముగ్గురు సేవకులు--నాటిక; బడాయి మేక కథ; "కరుక్కు జరజర దుబుక్కు మే"; చిట్టి కథలూ అవీ; చాలునింక.

**శనివారం 10-వ తేదీ**

రారండోయ్ (పిలుపుపాట); అక్కయ్య కబుర్లు; "నల్లముత్యం" నాటిక; "నాయకుడు"; కథ; పొడుపు కథలూ అవీ; "స్కిప్పింగ్" పాట; చాలునింక.

**శనివారం 17 వ తేదీ**

రారండోయ్ (పిలుపుపాట); అక్కయ్య కబుర్లు; "విద్యాభ్యాసం"--నాటిక; "బొమ్మలోయ్ బొమ్మలు" పాట; పెద్ద కళ్లు (కథ); అవీ ఇవీ; చాలునింక.

**శనివారం 24 వ తేదీ**

రారండోయ్ (పిలుపుపాట); అక్కయ్య కబుర్లు; "బొమ్మల కొలువు" నాటిక; "బుజబుజ రేకుల పిల్లుందా; బొమ్మల పెళ్లి" (రికార్డు); కథలూ, పాటలూ; చాలునింక.

## ఆటవిడుపు

### సెప్టెంబరు

**ఆదివారం 4-వ తేదీ**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "సినిమా పిచ్చి"--నాటిక; పడవ పాటలు; పొట్టి బావ పడవ షికారు; అవీ-ఇవీ, పోదామా!

**ఆదివారం 11-వ తేదీ**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "మహాలక్ష్మమ్మ" నాటిక. వింత కబుర్లు; తాతయ్య రహస్యం; కోలాటం; పోదామా!

**ఆదివారం 18-వ తేదీ**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; "తాతయ్య దుకాణం"—నాటిక; మాస్టర్ కుందు ఊహాగానం; ఒక చక్కని కథ; పోదామా.

**ఆదివారం 25-వ తేదీ**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచీ; పప్పు బెల్లాలు (నాటిక); దసరా సరదాలు; పొట్టి బావతో పది సెకండ్లు; పాటలూ అవీ—చాలునింక.

## దాగుడు బంధువులు

(జవాబు)

1. తాత; 2. అవ్వ; 3. తండ్రి; . మాత; 5. మామ; 6. అన్న; . వదిన; 8. బావ; 9. అక్క; 0; మరది.

బాలలతో ఆట మాటలు (జవాబు)

### (1)

1. బాల; 2. బావ; 3. బాకు; 4. గాన; 5. బారు; 6. బాకీ; 7. బావి; . బాధ; 9. బాతు; 10. బాగు; 1. బాకా.

### (2)

1. బాల; 2. పల; 3. కల; 4. కల; 5. అల; 6. ఈల; 7. పీల; 8. ఇల; 9. మాల; 10. లీల; 11. మూల.






కేవలము చిన్నపిల్లల వినోదము మాత్రం ఈయబడినది

# పిల్లల పజిల్ నెం. 4.




గడువు హామీలు
ముగింపు తేదీ
**20-9-49**

ప్రవేశరుసుము :- మొదటి ఎంట్రీ 0-3-0. 0-8-0 కు 3 ఎంట్రీలు. ఎంట్రీ ఫీ 0-3-0 పంపిన బిళ్ళలు గాను, అంతకు పైన మనిఆర్డరు గానున్ను పంపవలెను. రైటు ఆన్సరు అక్టోబరు "కోకిల" పిల్లలపత్రికలో ప్రకటించబడును. ఈ క్రింది అన్ని ప్రశ్నలు రైటు వ్రాసి పంపినవారికి మొదటి బహుమతియున్ను, 4 ప్రశ్నలు రైటు వ్రాసిపంపినవారికి రెండవ బహుమతియున్ను యివ్వబడును.

1 గురుదేవుడెవరు ?

2. దానములలో కెల్ల గొప్ప దానమేది ?

3 ఇందులో ఏది ఎక్కువ ? నీతి లేక జాతి.


4. ఇందులో మనకు ముఖ్యముగా అవసరమైయినదేది ? ధనమా లేక జ్ఞానమా.

5. ప్రపంచములో కెల్ల అమూల్యమయిన వస్తువేది ?

గుడ్ విల్ కాంపిటీషను (బి), పిల్లలపజిల్ నెం. 4, కొకినాడ.


Edited and Published by N. Raghava Rao and Printed by N. Kameswari at the "Bala Press" 170. Royapettah High Road, Madras 14.

# వావిటాల బాలలు



చి॥ వెంకటశివావధాని ; వాసుదేవశాస్త్రి (మద్రాసు), వెంకటశివావధాని (బందరు)



చి॥ అలిమేలుమంగమ్మ (బందరు), సుందరి (మదరాసు)




చి॥ గోపకుమార్

అక్షరాభ్యాసం



చి॥ ప్రసన్నకుమారి (బెంగుళూరు)

చోటాలీడర్



చి॥ బాబూ రాజేంద్రప్రసాద్ (గు[illegible]


అపూర్వ కల్పనా శిల్పంతో
హాస్యరస భరితమైన
అసమాన జానపద చిత్రం..
వాహినీ వారి
గుణసుందరి
కథ...
డాక్టర్. సుబ్బారావు...శివరావు...రేలంగి
శాంతకుమారి...మాలతి...శ్రీరంజని
నటించినది...
డైరెక్టర్...కె.వి.రెడ్డి, బి.యస్‌సి (ఆనర్సు)